Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 16.05.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 50 పేజీలు : 16, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## జననేతకు...
# పట్టాభిషేకం

- అభివృద్ధికి అధికారం
- అహంభావానికి అంధకారం
- ఇదీ తీర్పు....

భారత రాజకీయ చరిత్రలో 2014 మే 16వ తేదీని సువర్ణాక్షరాలతో లిఖించవచ్చు. ఎందుకంటే ఒక నాడు రైల్వేస్టేషన్‌లో టీ అమ్మిన కుర్రాడు ఈరోజు దేశ రాజకీయాలలోనే ఓట్ల సునామీ సృష్టించాడు. నూటపాతికేళ్ళ వృద్ధ కాంగ్రెస్‌ను కూకటి వేళ్లతో సహా పెకిలించి పారేసాడు.

(మిగతా 14వ పేజీలో)



# రాష్ట్రంలో 'చంద్రో'దయం..

(వివరాలు 3వ పేజీలో)

## నెల్లూరుజిల్లాలో...
# వైకాపా ఏడు... తెదేపా మూడు!

### నవతరానికి స్వాగతం

(వివరాలు 14వ పేజీలో)

నెల్లూరు లోక్‌సభ

మేకపాటి రాజమోహన్‌రెడ్డి (వైసిపి)
మెజార్టీ: 13,478

ఆత్మకూరు

మేకపాటి గౌతమ్‌రెడ్డి (వైసిపి)
మెజార్టీ: 31,412

నెల్లూరు రూరల్

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (వైసిపి)
మెజార్టీ: 25,653

నెల్లూరు సిటీ

పోలుబోయిన అనిల్ యాదవ్ (వైసిపి)
మెజార్టీ: 19,087

సర్వేపల్లి

కాకాణి గోవర్ధన్‌రెడ్డి (వైసిపి)
మెజార్టీ: 5,446

కావలి

రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి (వైసిపి)
మెజార్టీ: 4,969

తిరుపతి లోక్‌సభ

వి.వరప్రసాద్‌రావు (వైసిపి)
మెజార్టీ: 37,724

సూళ్లూరుపేట

కిలివేటి సంజీవయ్య (వైసిపి)
మెజార్టీ: 3,726

గూడూరు

పాశం సునీల్‌కుమార్ (వైసిపి)
మెజార్టీ: 9,048

కోవూరు

పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి (తెదేపా)
మెజార్టీ: 7,937

వెంకటగిరి

కురుగొండ్ల రామకృష్ణ (తెదేపా)
మెజార్టీ: 5,525

ఉదయగిరి

బొల్లినేని రామారావు (తెదేపా)
మెజార్టీ: 3,622







## కాంగ్రెస్సే బాసగా... ధ్యాసగా... తుదిశ్వాస విడిచిన...

# జనం మనిషి... 'జనయ్య'



నాయకులెందరో వుండవచ్చు..కానీ, జనం మనిషిగా ప్రజల ఆదరాభిమానాలను అందుకోవడం, ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకోవడం అంత తేలికైన పనేమీ కాదు. అందుకు ఎంతో నిబద్ధత వుండాలి..అంకితభావం వుండాలి. అన్నిటికీ మించి ప్రజల పట్ల మమకారం వుండాలి. వారి అభ్యున్నతికి అహరహం కష్టించే స్వభావం వుండాలి. ప్రజల కష్టసుఖాల్లో చేదోడువాదోడుగా వుంటూ, ఎల్లవేళలా వారికి అందుబాటులో వుండే నాయకునికే అది సాధ్యం. సాక్షాత్తూ నేదురుమల్లి జనార్ధనరెడ్డి కూడా అక్షరాలా అట్లాంటి మనస్తత్వం వున్నవారే. జనమంటే ఆయనకు వల్లమాలిన అభిమానం. అందువల్లనే ఆయన 'జనం మనిషి'గా ప్రజలందరి మనసుల్లో సుస్థిర స్థానం సాధించుకున్నారు. నెల్లూరీయులంతా ఎంతో అభిమానంగా 'పెద్దాయన' అని పిలుచుకునేంత ఆత్మీయతను సంపాదించుకున్నారు. అందుకే, ఆయన 'ఇక లేరు' అనుకుంటేనే..ఆయన అభిమానులకు కంటనీరు ఉప్పొంగుతుంది. ప్రత్యేకించి, జిల్లాలోని ప్రజలకు, ఆయన స్వస్థలమైన వాకాడులోని ప్రజలకు మనసంతా మూగబోయినట్లవుతుంది. గుండెనిండా ఏదో తెలియని వెలితి ఆవరించినట్లు అనిపిస్తుంది.

అయినా, ఒక సామాన్యమైన బడిపంతులు స్థాయి నుంచి.. రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగడమంటే మాటలా?.. రాజకీయ రంగంలో అనునిత్యం ఎదురయ్యే అనేకానేకమైన ఆటుపోట్లన్నిటినీ గుండెనిబ్బరంతో ఎదుర్కొని, ఎంతో దీక్షా దక్షతలతో, నిరంతర కృషితో అంతటి స్థాయిని సైతం సాధించి.. రాజకీయరంగంలో సింహపురి సీమ కీర్తిబావుటాను రెపరెపలాడించిన ఘనత ఒక్క నేదురుమల్లికే చెల్లిందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు.

1935 ఫిబ్రవరి 20వతేదిన వాకాడులో జన్మించిన నేదురుమల్లి, అధ్యాపక వృత్తి నుంచి, ఎంతో ఉన్నతమైన స్థాయికి ఎదిగారు. సేవాభావంతో వాకాడు విద్యాసంస్థల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. రాజకీయ రంగంలోకి వచ్చాక ఆ విద్యాసంస్థలకు జాతీయ ఖ్యాతిని తెచ్చారు. వాకాడు విద్యాసంస్థల వ్యవస్థాపకులైన నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి గారు పరమపదించినప్పుడు, ఏర్పాటైన సంతాప సభకు నాటి ముఖ్యమంత్రి మర్రిచెన్నారెడ్డినీ, మహానేత ఇందిరాగాంధీని సైతం వాకాడుకు తీసుకువచ్చారంటే నేదురుమల్లికి ఇందిరాగాంధీ కుటుంబంతో వున్న సాన్నిహిత్యానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేమి కావాలీ?.. అంచలంచలుగా ఎదుగుతూ, రాజకీయాల్లోనూ తనదైన శైలితో రాణించారు. అనేక సందర్భాల్లో తన రాజకీయ చతురతనూ, సత్తాను చాటుకున్నారు. దాదాపు అరవైఏళ్ళ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నెన్నో ఒడిదుడుకులను చవిచూశారు. గెలుపు ఓటములను ఒక్కటిగా భావించి, ఎక్కడ పరాజయం ఎదురైనా వెరవక, మరింత ఆత్మస్థైర్యంతో ముందడుగు వేశారు. అందువల్లనే, ఓటములకంటే విజయాలెన్నిటినో చవిచూశారు.

1952లో మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ఆయన పాల్గొనడం, ఆ సభలో జవహర్‌లాల్ నెహ్రూతో మరింత సన్నిహితంగా వుండడం ఆయన రాజకీయ మార్గానికి రాచబాటగా మారింది. తొలి నుంచి ఆయన కాంగ్రెస్ అంటే ప్రాణంగా భావించేవారు. పార్టీ అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసేవారు. పదవులు వచ్చినప్పుడు పొంగిపోకుండా, అదృష్టం కలసిరానప్పుడు కుంగిపోకుండా వుండే నిబ్బరమైన తత్వం ఆయనది. అదే ఆయన విజయానికి సోపానమైంది. రాజకీయ పరమపద సోపాన పటంలో నిచ్చెన మెట్లెక్కినప్పుడూ, ఏ రాజకీయ అవాంతరమో పాములాగా నోరుతెరచినప్పుడూ ఆయన దేనికీ వెరవలేదు. తాను నమ్ముకున్న కాంగ్రెస్‌ను ఏనాడూ వీడలేదు. 1972లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యునిగా నిలచి గెలిచారు. దీంతో ఆయనకు ఇందిరా గాంధీ కుటుంబంతోనూ, ఢిల్లీ రాజకీయాలతోనూ మరింత సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ తర్వాత, 1978లో కాంగ్రెస్ చీలిపోయి వెంగళరావు కాంగ్రెస్, ఇందిరా కాంగ్రెస్‌గా ఏర్పడినప్పుడు, నాయకులంతా అటువైపు వెళ్ళగా, నేదురుమల్లి మాత్రం ఇందిరా కాంగ్రెస్‌వైపే వుండడం, నాటి ఎన్నికల్లో జిల్లాలోని 11 స్థానాల్లో 10స్థానాలను ఇందిరాకాంగ్రెస్‌కి సాధించిపెట్టడం నేదురుమల్లి నిబద్దతకు, జిల్లాలో ఆయన రాజకీయప్రాభవ వైభవానికీ చక్కని నిదర్శనం.

మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలోనూ, ఆ తర్వాత అంజయ్య, భవనం వెంకట్రామ్, కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రివర్గాల్లోనూ మంత్రిగా స్థానం సాధించి, వచ్చిన ఆ పదవులన్నిటికీ ఆయన వన్నె తెచ్చారు.

1983లో వెంకటగిరి నుంచి పోటీచేసిన నేదురుమల్లి, ఎన్టీఆర్ ప్రభంజనంలో అతి తక్కువ ఓట్లతో ఓటమి చవిచూశారు. అయినా, ఏనాడూ కుంగిపోయింది లేదు. మరింత దీక్షతో జిల్లాలో కాంగ్రెస్ పునరుజ్జీవానికి కంకణం కట్టుకున్నారు. నెల్లూరులో కాంగ్రెస్ సభలు, సమావేశాలకు వేదిక కోసం విరాళాలు సేకరించి, అత్యంత అద్భుతమైన రీతిలో ఇందిరాకాంగ్రెస్ భవనాన్ని నిర్మించారు. ఆ భవనం ప్రారంభోత్సవానికి రాజీవ్‌గాంధీని ఆహ్వానించారు. అంతేకాదు, జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులను ఉత్తేజపరచి, కాంగ్రెస్ తిరిగి బలోపేతం అయ్యేందుకు ఆయన చేసిన కృషి అపారమైనది. ఆయన కఠోరదీక్షా దక్షతలతో, పార్టీ కార్యకర్తలను, నాయకులను సమీకరించి పార్టీ తిరిగి నిలదొక్కుకునేలా చేశారు. ఫలితంగా 1989 ఎన్నికలు వచ్చేసరికి, జిల్లాలోని 11 శాసనసభా స్థానాల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. దీంతో, జిల్లాలో తిరిగి కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది.

ఆ తర్వాత, నేదురుమల్లికి ఎదురే లేకుండా పోయింది. పార్టీకి నేదురుమల్లి చేసిన సేవలు ఢిల్లీదాకా మారుమ్రోగాయి. దీంతో ఆయనకు రాష్ట్ర కాంగ్రెస్ సారథ్యం లభించింది. 1988లో ఆయన పిసిసి అధ్యక్షునిగా పదవీబాధ్యతలు స్వీకరించారు. అప్పటికే ఆయనకు ముఖ్యమంత్రి అయ్యే సత్తా, సామర్థ్యం వున్నాయని ఢిల్లీ నేతలు సైతం గుర్తించారు. రాష్ట్రంలో సమస్యలను ఒక కొలిక్కి తెచ్చి, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపింపజేసే సత్తా వున్న జనార్ధన్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి లభించింది. 1990లో ఆయన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన పాలనలో అటు రాష్ట్రాన్నీ, ఇటు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి, అందరి ప్రశంసలూ అందుకున్నారు. ఆ తర్వాత, 1998లో బాపట్ల నుంచి ఎంపీగా, 1999లో నరసరావుపేట, 2004లో విశాఖపట్నం నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతం నుంచి పోటీ చేసినా విజయం వరించే నేతగా నేదురుమల్లి ఖ్యాతిని పొందారు. రాజకీయరంగంలో ఎన్నెన్నో పదవులు నిర్వహించి, ఎందరెందరో ప్రముఖులతో సాన్నిహిత్యం నెరపిన మహా రాజకీయవేత్త నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. ఇందిరాగాంధీ కుటుంబంతోనూ, రాజీవ్‌గాంధీ, సోనియగాంధీ తదితర జాతీయనేతలతోనూ ఆయనకున్న సాన్నిహిత్యంతో అటు రాష్ట్రానికీ, ఇటు జిల్లాకు ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలను, అభివృద్ధి పనులనూ సాధించారు. ఆనాటి రాష్ట్రపతులు ఎంకె నారాయణన్, ఆర్.వెంకట్రామన్, జ్ఞానీ జెయిల్ సింగ్‌తోనూ, అప్పటి ప్రధాని పివి నరసింహారావు, నాటి గవర్నర్ కృష్ణకాంత్‌లతో పాటు, ఆచార్య ఎన్‌జి రంగా, మనజిల్లాకు చెందిన మరో మహోన్నత నేత డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి వంటి సీనియర్ నాయకులతో పాటు దేశంలోని అనేకమంది ప్రముఖ నాయకులతో నేదురుమల్లికి వున్న సాన్నిహిత్యం ఎంతో విశిష్టమైనది. ఎందరో ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎందరెందరో మహానాయకులతో ఆయనకున్న అనుబంధం సాటిలేనిది.

ప్రత్యేకించి తానెంత ఉన్నతస్థాయిలో వున్నా జిల్లా అభివృద్ధినీ, తాను ప్రాతినిధ్యం వహించిన వెంకటగిరి నియోజకవర్గ అభ్యున్నతినీ, తన స్వస్థలమైన వాకాడు ప్రజల సంక్షేమాన్నీ ఆయన ఏనాడూ విస్మరించలేదు. జిల్లాలో ఏ మారుమూల పర్యటనకు విచ్చేసినా, రాత్రికి ఆయన వాకాడుకు వెళ్ళి తీరవలసిందే. అక్కడున్న ప్రజల యోగక్షేమాలు విచారించాల్సిందే. జననీ జన్మభూమిశ్చ..అన్నట్లు ఆయనకు తన స్వస్థలమైన వాకాడు అంటే ఎంతో ఇష్టం. తానెంతటి ఉన్నత స్థాయిలో వున్నా, తనకు తెలిసినవారెవరైనా కనిపిస్తే, పేరుపెట్టి పిలిచే మనస్తత్వం ఆయనది. ప్రజలతో సన్నిహితంగా వుండడమే కాక, ప్రజల సంక్షేమాన్ని కాంక్షించడంలో ఆయనకు ఆయనే సాటి. వెంకటగిరిలో రోడ్ల అభివృద్ధికి, లింక్‌రోడ్ల ఏర్పాటుకు ఆయన ఎంతగానో కృషిచేశారు. వెంకటగిరిలో 9వ బెటాలియన్ ఏర్పాటైందన్నా, రైతులకు ఎంతగానో ఉపయోగపడే నిమ్మ-చీనీ పరిశోధన కేంద్రం ఏర్పాటైందన్నా అంతా నేదురుమల్లి చేతిచలువే.

జిల్లా రాజకీయరంగంలో ఎందరికో భవిష్యత్తును ప్రసాదించి, నమ్ముకున్న వారి సంక్షేమాన్ని కాంక్షించిన సహృదయ నేత..నేదురుమలి జనార్ధనరెడ్డి. కాంగ్రెస్సే ధ్యాసగా, శ్వాసగా జీవించి, పార్టీ అభ్యున్నతికే అహరహం శ్రమించి, మధ్యతరగతిస్థాయి నుంచి ముఖ్యమంత్రి దాకా ఎదిగి, జిల్లా రాజకీయరంగంలో పెద్దాయనగా అందరి హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న మహోన్నత నేత ఆయన. 80 ఏళ్ళ వయసులో, అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, మే 9వతేది వేకువన ఆయన కన్ను మూయడంతో, ఈ జిల్లా ఒక మహానేతను.. ప్రజా హృదయ విజేతను కోల్పోయినట్లయింది. ఆయన మరణం జిల్లాకు, రాష్ట్రానికే కాదు, దేశానికే తీరని లోటు. ఆ మహానేత మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది 'లాయర్'.

## ఆయన స్టైలే వేరు...!

ఏ పదవిలో వున్నా ఆయన స్టైలే వేరుగా వుండేది. అధికారులను, వారెంతటి స్థాయివారైనాసరే, లెక్కచేయకుండా పేరు పెట్టి పిలిచేవారాయన. కొందరినైతే ఆత్మీయంగా ఒరేయ్ అని కూడా సంబోధించేవారు. ఆయన వర్కింగ్ స్టైల్ కూడా అందరికీ నచ్చేది. తను అనుకున్న పనిని అనుకున్న స్థాయిలో అధికారులచేత చేయించుకోగల దిట్ట జనార్ధనరెడ్డి. రాష్ట్ర రాజకీయాల్లో సైతం ఎంతోమంది నాయకులకు రాజకీయ మార్గదర్శనం చేసింది ఆయనే. చిన్న స్థాయి నాయకులను సైతం మంచి నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. జిల్లాలో పసల పెంచలయ్య, పత్రా ప్రకాశరావు, నెలవల సుబ్రహ్మణ్యం, చేవూరు దేవకుమార్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాగుంట సుబ్బరామరెడ్డి, మాదాల జానకిరామ్, కె.వి.సుబ్బారెడ్డి, సి.వి.శేషారెడ్డి, చెంచలబాబు యాదవ్, కుడుముల పద్మశ్రీ వంటి వారితోపాటు, కేంద్రమంత్రి పనబాక లక్ష్మి వంటి ఎంతో మందికి ఆయనే రాజకీయ గురువు. కాంగ్రెస్ అంటే ఆయనకు ప్రాణం. తాను ప్రాణసమానంగా భావించే కాంగ్రెస్ వెనుకబడిపోవడాన్ని ఆయన సహించేవారే కాదు. కానీ, ఇప్పటి తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ ఇంతగా.. ఇక లేనంతగా చతికిలబడిపోవడం చూసి వుంటే ఆయన మనసు ఇంకెంత విలవిలలాడేదో!..ఆ భగవంతుడు ఆయనకు ఆ బాధ లేకుండా చేశాడు. ఏదేమైనా, జీవితకాలమంతా కాంగ్రెస్సే బాసగా, కాంగ్రెస్సే శ్వాసగా.. ధ్యాసగా బతికి, 80 ఏళ్ళ వృద్ధాప్యంలోనూ రాజకీయ భీష్మునిగా ఎందరికో రాజకీయ జీవితమిచ్చిన పెద్దాయన ఇక లేకపోవడం జిల్లాకు తీరని లోటే.







# 'చంద్రో'దయం

**చినుకు చినుకు కలిస్తేనే చెరువు నిండుతుంది. సీమాంధ్రలో చంద్రబాబు విజయ రహస్యం కూడా ఇదే! ఓటు ఓటును పట్టాడు. ఓటు బ్యాంకుగా మలి చాడు. ఈ ఎన్నికలలో ఓట్ల సాగు చేసాడు. సీట్ల పంట పండించాడు. తనను తక్కువుగా అంచనా వేసిన వారికి దిమ్మ తిరిగేలా చేసాడు. రాజకీయాల్లో రాణించాలంటే ఉండాల్సింది ఆకర్షణ కాదని, ఆలోచన అని చాటిచెప్పాడు. గాలులు, ప్రభంజనాలను నమ్ముకోకుండా చాపక్రింద నీరులా తన పని చేసుకుపోతూ ఇక తనకు దక్కదనుకున్న సీమాంధ్రను చేజిక్కించుకున్నాడు.**

రాష్ట్ర విభజనకు ముందు పరిస్థితేంటి... ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆంధ్రప్రదేశ్‌లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పెద్ద పార్టీగా అవతరిస్తుందని... రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితి ఏంటి...? సీమాంధ్రలో జగన్ స్వీప్ చేస్తాడని, వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీకి అధికారం ఖాయమని... కాని ఇప్పుడేం జరిగింది? తెలుగుదేశం అనూహ్యంగా అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇది జగన్ వైఫల్యమా? చంద్రబాబు గొప్పతనమా? జగన్ వైఫల్యాలను తనకు అనుకూలంగా మలచుకోవడమే ఇక్కడ చంద్రబాబు గొప్పతనం. రాష్ట్ర విభజనకు ముందుగాని, తర్వాత గాని రాష్ట్రంలో జగన్‌కే అనుకూలంగా పరిస్థితులుండినాయి. రాష్ట్ర విభజన నేపథ్యంలో సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ కుదేలయ్యింది. ఆ సమయంలో ఎంతో అనుభవజ్ఞులు, గట్టి కేడర్ వున్న కాంగ్రెస్ నాయకులు వైయస్సార్ కాంగ్రెస్‌లోకి రావాలనుకున్నారు. అయితే జగన్ వారికి నో ఎంట్రీ బోర్డు పెట్టాడు. వస్తే కార్యకర్తలు మాదిరిగా పనిచేయండి, సీట్లు ఇవ్వడం మాత్రం కుదరదని చెప్పాడు. దాంతో సీమాంధ్రలోని 13జిల్లాల నుండి కూడా మంచి కాంగ్రెస్ నాయకులు తెలుగుదేశంలోకి వెళ్లిపోయారు. వారితో పాటే చాలావరకు కాంగ్రెస్ కేడర్ కూడా వెళ్లింది. దీంతో ఉన్నట్లుండి సీమాంధ్రలో తెలుగుదేశం శక్తివంతంగా మారింది. చంద్రబాబుకు హుషారొచ్చింది. తన ప్రచారసరళిని మార్చాడు. పక్కా ప్లాన్‌తో బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడు. దాని ద్వారా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధాని కానున్నాడని, రాష్ట్రంలో తానూ సీఎం అయితే సీమాంధ్రను పునర్నిర్మించగలమనే ప్రచారాన్ని ప్రజలలోకి పంపాడు. కొన్ని వర్గాల ప్రజలు దీని గురించి ఆలోచించారు. అలాగే ప్రజల్లో వున్న మోడీ ఫ్యాక్టర్ కూడా ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు బాగా లాభించింది. 2004ఎన్నికల్లో చంద్రబాబును కక్షకట్టి ఓడించిన ఉద్యోగులు కూడా అనుభవజ్ఞుడైన చంద్రబాబుకు అధికారమిస్తేనే కేంద్రంలోని ఎన్డీఏ నుండి నిధులు తేగలడని భావించి ఆయన వైపే మొగ్గు చూపారు. ఇక రైతాంగం మీద తీవ్రంగా ప్రభావం చూపింది రుణమాఫీ హామీ, చంద్రబాబు వస్తే ఋణ మాఫీ చేస్తాడనే ఆశతో చాలామంది రైతులు కొన్ని నెలలుగా బ్యాంకుల్లో అప్పులు కూడా కట్టడం లేదు. కేవలం బీజేపీకి మాత్రమే ప్రచారం చేస్తానన్న పవన్ కల్యాణ్‌ను కూడా చంద్రబాబు తన వైపుకు లాక్కున్నాడు. ఆయన చేత ప్రచారం చేయించడం ద్వారా సీమాంధ్రలో బలంగా వున్న కాపు ఓట్లను రాబట్టాడు. ఇక జగన్‌కు వ్యతిరేకంగా, చంద్రబాబుకు అనుకూలంగా అండర్ కరెంట్‌లా పని చేసింది మతపరమైన అంశం. విజయమ్మ, షర్మిలలు బహిరంగంగా క్రైస్తవ మత ప్రచార సభలలో పాల్గొనడం కూడా కొన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తిని పెంచింది. ఈ కారణంతోనే బ్రాహ్మణులు, వైశ్యులు ఆ పార్టీకి దూరమయ్యారు. విశాఖలో విజయమ్మ ఓడిపోవడానికి కారణాలలో ఇదొకటి.

ఇక అసలు కారణం గాలితోనే గెలుస్తామనుకోవడం. జగన్ గాలితోనే మేం గెలుస్తామని నాయకులు భ్రమల్లో మునిగిపోవడం. జగన్ గాలి వుంది... అదెంత వరకు... వందకు వంద ఓట్లు తెచ్చేంత కాదు. ప్రతి వందకు ఓ ముప్పై మంది జగన్‌ను చూసి ఓటేస్తారనుకుంటే, ఇంకో పది, ఇరవైమంది ఖచ్చితంగా అభ్యర్థుల శక్తి సామర్థ్యాలను బట్టి ఓటేస్తారు. కాని జగన్‌లో ఆత్మవిశ్వాసం పాళ్లు ఎక్కువై, వార్డు మెంబర్‌లుగా పనికి రాని వాళ్లను కూడా ఎమ్మెల్యే అభ్యర్థులుగా నిర్ణయించారు. ఇలాంటి సీట్లలో వైకాపా దెబ్బతింది.

జగన్ పక్కా ప్రణాళికతో వ్యవహరించి ఉంటే ఈరోజు అధికారం ఆయనదే! కాని ఆత్మవిశ్వాసం బదులు అతివిశ్వాసం పెరగడం, కొన్ని వర్గాలను దూరం చేసుకోడం, వస్తామనుకున్న నాయకులను వద్దనుకోవడం వంటి స్వయంకృతాపరాధాలతో వైయస్సార్ కాంగ్రెస్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. లేదంటే రెండేళ్ల క్రితం జరిగిన ఉపఎన్నికల్లో వైకాపా అభ్యర్థులు దిక్కు తెలియని బంపర్ మెజార్టీలతో గెలవడమేంటి..? ఈరోజు అదే పార్టీ అభ్యర్థులు వెనకబడిపోవడమేంటి... అంతా పార్టీ అధినాయకత్వం చేసుకున్నదే!

# గల్లీ టు ఢిల్లీ! టిడిపి 5 వ్యవస్థలు ఏళ్ళు

పాలనా వ్యవస్థలో ప్రధానమైన అయిదు వ్యవస్థల్లోనూ ఈసారి తెలుగుదేశం పార్టీ తన ప్రాభవ వైభవాన్ని చాటుకుంది. దాదాపు పదేళ్ళ విరామం అనంతరం రాష్ట్రంలో టిడిపి సమధికోత్సాహంతో ఎన్నికల్లో పాల్గొని, ప్రజల అభిమానాన్ని చూరగొంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో, సీమంధ్రకు ఆశాజ్యోతిగా ప్రజలకు కనిపించిన ఏకైక నేత, అభివృద్ధి ప్రదాత, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు. టిడిపి మళ్ళీ తన బలాన్ని నిరూపించుకుంది. ప్రజలకు తెలుగుదేశం పట్ల తరగని అభిమానం వుందనేందుకు ఈ ఎన్నికలే ఒక ప్రత్యక్ష నిదర్శనం. అందులోనూ, పంచాయతీ స్థాయి నుంచి లోక్‌సభ స్థాయి వరకూ జరిగిన ఈ అన్ని ఎన్నికల్లోనూ రాష్ట్రంలో టిడిపి తన సత్తాను చాటుకుంది. అటు పంచాయతీల్లోనూ, ఇటు మునిసిపాల్టీ, జిల్లా పరిషత్, శాసనసభ, లోక్‌సభ స్థానాలకు..మొత్తంగా ఎంతో కీలకమైన ఈ అయిదు వ్యవస్థల్లోనూ టిడిపి అభ్యర్థులే అత్యధికంగా రాణించారు. గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు, గల్లీ నుంచి ఢిల్లీ దాకా తమ ప్రాతినిధ్యాలతో పసుపుజెండాలను రెపరెపలాడించనున్నారు. అయితే, ఇక్కడ ఒక్క మాట!.. గ్రామాల అభ్యున్నతే దేశాభ్యున్నతికి రాచబాట వేస్తాయనేది అందరికీ తెలిసిందే. ప్రగతి పూల పరిమళాలతో ప్రతి ఇల్లూ, ప్రతి గ్రామం కళకళలాడిన నాడు దేశమంతా అభివృద్ధిపథంలో పయనిస్తుంది. ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని ప్రాంతాల్లో, ప్రధానమైన ఈ అయిదు వ్యవస్థలకూ జరిగిన ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఒక విశేషం. అభినందనీయం కూడా. గ్రామాభ్యున్నతికి, అటు పురపాలక, నగరపాలక, మండల పరిషత్, జిల్లా పరిషత్, శాసనభ స్థానాలు.. లోక్‌సభ పరిధిలోని ప్రాంతాలు ఎక్కడ చూసినా తెలుగుదేశంపార్టీ వైభవమే కనిపిస్తోంది. బహుశా రాష్ట్ర చరిత్రలోనే ఇలాంటి సందర్భం, ప్రతిపక్షం ఎక్కడా లేకుండా అన్ని వ్యవస్థలలోనూ తామే ఆధిక్యతతో వుండే అవకాశం ఇంతవరకూ ఏ పార్టీకి వచ్చిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ అంచలంచలుగా పురోగమించేందుకు, తక్కువ వ్యవధిలోనే ఎక్కువ ప్రగతిని సాధించేందుకు ఇంతకన్నా గొప్ప అవకాశం మరొకటి వుండదు. అందరూ కలసికట్టుగా నడుం బిగించి కృషిచేస్తే, అభివృద్ధి దానంతటదే చెంతకు చేరుతుంది. అందుకు నిరంతర శ్రమ, దీక్ష, దక్షతలతో పాటు, సంయమనం ఎంతో అవసరం. ప్రజల సమస్యల పట్ల నాయకులు మమేకమవుతూ, ఇంతకాలం పడిన కష్టాలనుంచి ప్రజలను గట్టెక్కించేందుకు అందరూ కంకణబద్ధులు కావాలి. ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగాలి. సహనంతో, సంయమనంతో పనిచేస్తూ, అన్నిటినీ మించి పార్టీలకు అతీతంగా..ప్రజల సమస్యల సాధనే పరమావధిగా (మిగతా 14వ పేజీలో)






## కృతజ్ఞతలు

నెల్లూరు వంటి నగరంలో సాహసం చేసి ఒక మైనార్టీ యువకుడిని మేయర్ అభ్యర్థిగా ప్రకటించినందుకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. అగ్రవర్ణాల ఆధిపత్యం సాగే నెల్లూరులో ముస్లింలకు అవకాశం రావడం అరుదైన విషయం. దానికిగాను జగన్ పట్ల ముస్లింలు తమ కృతజ్ఞత చాటుకుని అధిక డివిజన్‌లలో వైకాపా అభ్యర్థులను గెలిపించారు. అజీజ్ మేయర్‌గా ఎన్నికయ్యాక కులమతాలకతీతంగా పనిచేసి ప్రజల మెప్పు పొందాలి.

ఎస్.కె.నాయబ్ రసూల్,
నెల్లూరు.

## శుభ సూచకం

దేశంలో యూపిఏ పాలన అంతం కావడం శుభసూచకం. మన్మోహన్‌సింగ్ పదేళ్ల పాలన వల్ల దేశాభివృద్ధి పాతికేళ్లు వెనక్కిపోయింది. ప్రధాని వంటి అత్యున్నత పదవిలో ఉండి తన మేధాశక్తిని దేశ ప్రయోజనాల కోసం వినియోగించలేని నేతగా మన్మోహన్‌సింగ్ మిగిలిపోయాడు. దేశానికి ఇలాంటి ప్రధానులు ఇక వద్దు. స్థిరమైన, దృఢమైన నిర్ణయాలు తీసుకోగల నరేంద్ర మోడీ లాంటి నాయకులే రావాలి.

వి.సి.గిరిప్రసాద్, వెంకటగిరి.

## నిబంధనలు ఫెయిల్

ఈ ఎన్నికల్లో ఎన్నికల సంఘం విధించిన నిబంధనలు అమలు కాలేదు. ఓటర్లపై ప్రలోభాల ప్రభావం బాగానే పనిచేసింది. డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేసారు. నిరుపేదలే కాదు, ధనవంతులు కూడా ఈ ఎన్నికల్లో ఓట్లు వేయడానికి డబ్బులు తీసుకోవడం సిగ్గుచేటు. మద్యమైతే ఏరులై పారింది. ఎన్నికల సంఘం నిబంధనలు అమలు కావడం అసాధ్యంగా వుంది. ఎన్నికల విధానంలోనే కొన్ని మార్పులు చేయాల్సివుంది.

నేలనూతల రవి, ఒంగోలు.

## మతమే కారణం

మున్సిపల్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో తెదేపా ముందంజలో ఉండడానికి కారణం వైకాపాపై ఒక మత ప్రభావం పనిచేయడమే. ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో ఆ ప్రభావం ఎక్కువగా పనిచేసింది.

రవీంద్రశాస్త్రి, నెల్లూరు.

# 'ప్రభా'తం

ప్రపంచంలోనే అతి పెద్దదైన మన ప్రజాస్వామ్య వ్యవస్థ.. కొంతమంది చేసే స్వార్థ రాజకీయాలతో రానురాను నవ్వుల పాలవుతోంది. దేశవ్యాప్తంగా అవినీతి అక్రమాలకు కొదవే లేకుండా పోతోంది. స్వార్ధపరుల దుర్నీతికి, దురాగతాలకు అంతే లేకుండాపోతోంది. నోట్ల కట్టలతో ఓట్లు కొల్లగొట్టుకోవాలనీ, ప్రజల ప్రాణాలు ఏమైపోయినా పర్వాలేదు..మద్యం తాగించైనా సరే..ఓట్లు లాగించెయ్యాలనీ, ధనబలంతో జనబలాన్ని పెంచుకోవాలనీ అనుకునేవారి సంఖ్యే గణనీయంగా పెరిగిపోతోంది. కోట్లు ఇచ్చి సీట్లు కొనుగోలుచేసుకున్నామనీ, ఇక గెలిచేందుకు ఎన్ని కోట్లయినా సరే కుమ్మరిస్తామనీ.. బస్తాలకొద్దీ నోట్లకట్టలు కుమ్మరించడం ఎన్నికల్లో అనేకమంది నాయకులకు ఒక ఆనవాయితీగా మారుతోంది. ఫలితంగా ఎన్నికల వేళ..నోట్ల కట్టలు..కట్టలుతెంచుకోవడం, ఊళ్ళు .. మద్యం పరవళ్ళతో ఉరకలెత్తడం సర్వ సాధారణమైపోతోంది. ఈసారి కూడా దేశంలో అనేకచోట్ల అదే జరిగింది. అక్రమ మద్యమే కాదు.. నకిలీమద్యం కూడా ఏరులై ప్రవహించింది. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఎన్నికల సందర్భంగా అక్షరాలా మూడు వందల పదమూడు కోట్ల రూపాయల నగదు పట్టుబడిందంటే, ఈ ఎన్నికల్లో ధనప్రవాహం ఉధృతి ఎంత భయంకరంగా వుందో అర్ధ మవుతుంది. అంతేకాదు, ఈ మొత్తం నగదులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 153 కోట్ల రూపాయలను స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితి ఎంత ఘోరంగా వుందో చెప్పకనే చెప్తుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల మేరకు చూసినా, దేశవ్యాప్తంగా 2.25 కోట్ల లీటర్ల మద్యం పట్టుబడిందంటే ఓట్లకు, మద్యానికి మధ్య వున్న లింకు ఎంత బలంగా వుందో తేటతెల్లమవుతోంది. అందులోనూ, అభివృద్ధిలో అగ్రగామి అనుకుంటున్న మన రాష్ట్రం కూడా తక్కువేమీ కాదు. ఒక్క మన రాష్ట్రంలోనే 1.44 కోట్ల లీటర్ల మద్యం స్వాధీనం కావడం..నిజంగా సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. మొన్నటికి మొన్న ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో, మన రాష్ట్రం అక్రమ నగదులోనూ, మద్యంలోనూ ప్రథమస్థానంలో వుందన్నప్పుడు, అక్కడున్నవారంతా ఫక్కున నవ్వారంటే.. ఇదేనా మన ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి?..ఇదేనా మన నీతి?..ఇదేనా తెలుగుజాతి రీతి?.. అని ప్రజలకు తీవ్ర ఆవేదన కలుగుతోంది. అసలే, విభజనతో అన్యాయం జరిగిపోయిందనుకుంటున్న తెలుగు ప్రజల హృదయాలు.. ఈ కీలకమైన ఎన్నికల వేళ కూడా యథేచ్ఛగా జరిగిపోయిన అక్రమాలకు, అవినీతికీ మరింత ఆవేదనకు గురవుతున్నాయి. ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలనీ, మంచి నేతలను ఎన్నుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలనీ, దేశాన్ని ప్రగతిపథంలో నడిపేందుకు అందరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలనీ ఎన్నికల కమిషన్ పదేపదే చెప్తున్నా, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎన్నికల కమిషన్ ఎంతో చొరవ తీసుకుని ఓటుకున్న ప్రాధాన్యతను వివరిస్తూ జనజాగృతికి అహరహం చిత్తశుద్ధితో కృషి చేసినా.. కొంతమంది అక్రమార్కులు మాత్రం తమ దురాగతాలను వీడ లేదు. తమ అనైతిక అక్రమాల బాటను వదల్లేదు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఏకైక స్వార్థంతో ధనబలంతో రంగంలోకి దిగడం, అన్ని రకాల అడ్డదారులు తొక్కడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా ప్రవర్తించడం ఎంతైనా బాధాకరం. అసలు, అభ్యర్థులుగా కావడం వద్దనుంచీ ధనం మూటలు విప్పాల్సివచ్చింది. మంచీ లేదు చెడూ లేదు..గెలిస్తే ఇక మన పరపతికి అడ్డేమీ వుండదనే ధనబలం విర్రవీగింది. అనుకున్నట్లుగానే అనేకచోట్ల కోట్లాధిపతులకే సీట్లు దక్కాయి.ఇక ఊళ్ళల్లో మద్యం నిల్వలు చేరుకున్నాయి. మద్యం బాటిళ్ళు, బెల్ట్‌షాపులు కళకళలాడాయి. దీంతో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు, అధికార యంత్రాంగమంతా వీటిని అరికట్టేందుకు అహోరాత్రులు కాపలాకాయాల్సి వచ్చింది. మద్యం నియంత్రణకు పెద్దసంఖ్యలో తనిఖీలు, తనిఖీ కేంద్రాలు పెట్టాల్సి వచ్చింది. వాహనాల నిండా మందు బాటిళ్ళే.. పొలాల్లో తవ్వితే మద్యం గుట్టలుగుట్టలే. అనేక సందర్భాల్లో అధికారులే ఈ మద్యం నిల్వలను చూసి నివ్వెరపోవాల్సి వచ్చింది. ఒకవైపు విభజనతో రాష్ట్రం పరిస్థితి సమస్యల సుడిగుండాల్లో పడుతుందేమోననే ఆవేదన, ఆందోళనతో వున్న సమయంలో కూడా, సరైన సమయంలో సరైన నాయకత్వాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితుల్లో, ఎంతో కీలకమైన ఈ ఎన్నికల్లో ఇంత బరితెగించి, బాహాటంగానే ఎవరికి తగ్గట్టు వారు అక్రమాలకు తెగబడడాన్ని ఏమని అర్ధం చేసుకోవాలి?..

ధనబలం, కండబలంతో ఘర్షణలకు దిగడం, ప్రత్యర్థులను ఓడించాలని నానా కుట్రలూ చేసుకోవడం.. నగదు, మద్యంతో ఓట్లు సాధించాలనుకోవడం?. . ఏమిటిదంతా?.. ఇంకా ఎంతకాలం ఈ అరాచక ప్రవృత్తి?.. శాంతి-సహనాలతో, నీతి-నియమాలతో ప్రగతిపథంలో రాణించే మన జాతి కీర్తిపతాకను ప్రపంచదేశాల్లో రెపరెపలాడించాల్సిన తరుణంలో, మన ఖ్యాతిని మనమే ఇలా అపఖ్యాతి పాలు చేసుకోవడం, ప్రజాస్వామ్యంతో ఫరిడవిల్లే మన జాతి ఖ్యాతిని మనమే నవ్వులపాలు చేసుకోవడం.. ఎంతవరకూ సమంజసం?.. అందరం ఆలోచించుకోవాల్సిన సమయం ఇది.

## ఇదేనా మన రీతి... ఇదా మన ఖ్యాతి?



కొంతమంది అక్రమార్కులు ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఏకైక స్వార్థంతో ధన బలంతో రంగంలోకి దిగడం, అన్ని రకాల అడ్డదారులు తొక్కడం, ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా ప్రవర్తించడం ఎంతైనా బాధాకరం.

# 'అంతర్'జాతీయం

- ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు ప్రధానమంత్రి కార్యాలయం ఈ నెల 14న ఘనంగా వీడ్కోలు పలికింది. సోనియాగాంధీతో పాటు మంత్రివర్గ సహచరులు ఆయనను ఘనంగా సత్కరించారు.
- ఈ నెల 10వ తేదీన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో 9మంది భారతీయులు సహా 13మంది మరణించారు. 27మంది కార్మికులతో వెళుతున్న బస్సు ఆగివున్న ఓ ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. చనిపోయిన భారతీయులందరూ బీహార్ రాష్ట్రీయులే!
- బ్రిటన్‌కు చెందిన రోల్స్‌రాయిస్ సంస్థతో వ్యాపార లావాదేవీల కొనసాగింపుకు సంబంధించిన ఒక ప్రతిపాదనను కేంద్ర రక్షణశాఖ మంత్రి ఏ.కె.ఆంటోని తిరస్కరించారు.
- భారత సైనిక దళాల ప్రధానాధికారి నియామకానికి కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతించాలని ఎన్నికల కమీషన్ నిర్ణయించింది.
- వారంరోజుల్లోగా దేశం విడిచి వెళ్లాలని ఇద్దరు భారత పాత్రికేయులను పాకిస్థాన్ ప్రభుత్వం ఆదేశించింది. 'ది హిందు'కు చెందిన మీనామీనన్, పిటిఐకి చెందిన స్నేహేశ్ అలెక్స్ పిలిప్స్‌లు వీసాలు పునరుద్దరించుకోకపోవడంతో ఈ విధంగా ఆదేశించారు.
- ఉన్నత విద్యలో నాణ్యత పెంపుదల మన దేశ ప్రథమప్రాధాన్యత కావాలని రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఆకాంక్షించారు. ఈ నెల 10వ తేదీన జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌లో జరిగిన 'ఇండియన్ స్కూల్స్ ఆఫ్ మైన్స్' స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ ఇంజనీరింగ్ పట్టభద్రులు 52శాతం మందికి మొత్తంమీద 34శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చే నైపుణ్యత ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.
- ఈ నెల 10వ తేదీన ఉత్తరాఖండ్‌లోని ఛమోది జిల్లా నందప్రయోగ ఘాట్ రోడ్డులో బస్సు లోయలో పడిన దుర్ఘటనలో 17మంది ప్రయాణీకులు మృతి చెందారు. 300మీటర్ల లోయలో పడడంతో బస్సు రెండుముక్కలైంది.
- దక్షిణాఫ్రికాలో జరిగిన ఎన్నికల్లో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ 62.15 శాతం ఓట్లను దక్కించుకుని విజయం సాధించింది.
- ఈ నెల 13వ తేదీన బాగ్దాద్‌లో సంభవించిన బాంబుపేలుళ్లలో 25మంది మృతి చెందగా 80మంది గాయపడ్డారు. షియాముస్లింలే లక్ష్యంగా 9చోట్ల కారుబాంబులను పేల్చారు.
- ప్రభుత్వంలో అవినీతి, పలుశాఖల్లో అవకతవకలను బయటపెట్టే ప్రజావేగులను రక్షించే విధంగా రూపొందించిన 'ప్రజావేగులరక్షణ చట్టం – 2011'కు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదముద్ర వేశారు.

# వార్త వ్యాఖ్య

వార్త :- రాజధానిని నిర్ణయించేది కేంద్రమే.
– నిపుణుల కమిటీసభ్యుడు రతన్‌రామ్.
వ్యాఖ్య :- ***విభజనతో మా తలరాతను నిర్ణయించేసారుగా... రాజధాని ఎక్కడైతే ఏంటి?***

వార్త :- ఫలితాల తర్వాతే మూడోకూటమి ప్రయత్నాలు. – ప్రకాశ్‌కారత్.
వ్యాఖ్య :- ***ఇప్పుడు అనవసరపు శ్రమ అనుకుంటున్నారా?***

వార్త :- ఎన్నికల సంఘంలో విభేదాలు లేవు.
– ప్రధాన ఎన్నికల కమీషనర్ సంపత్.
వ్యాఖ్య :- ***మీక్కూడా రాజకీయాలు ఒంటబట్టాయా ఏంటి?***

వార్త :- నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి. – గవర్నర్‌కు చంద్రబాబు లేఖ.
వ్యాఖ్య :- ***మీ లేఖ ఆయనకు చేరేలోపు ఇక్కడ కొత్త ప్రభుత్వం వస్తుంది లేండి.***

వార్త :- అవినీతిపై విసుగులేని పోరాటం. – జస్టిస్ చంద్రకుమార్.
వ్యాఖ్య :- ***అవును... నిరంతర పోరాటం చేసినా ఫలితం ఉండదు కాబట్టి.***

వార్త :- అవినీతివల్లే అభివృద్ధిలో వెనుకంజ.
– సీసీఎంబి డైరక్టర్ మోహన్‌రావు.
వ్యాఖ్య :- ***అవినీతి ఎక్కువ కావడం కూడా అభివృద్ధే కదా!***

వార్త :- మాది సమిష్టి నాయకత్వం. – కాంగ్రెస్.
వ్యాఖ్య :- ***అది తెలిసిందేలే... ఓడితే సమిష్టి లోపం.. గెలిస్తే రాహుల్ ఇమేజ్!***

వార్త :- నియామకాల్లో సోనియా జోక్యం చేసుకునే వారు.
– ప్రణాళికా సంఘం సభ్యుడి వెల్లడి.
వ్యాఖ్య :- ***ప్రధానమంత్రినే ఆమె నియమిస్తే మిగతావి ఓ లెఖ్ఖా?***

వార్త :- ఎంత మేధావో... అంత మెతక! – మన్మోహన్‌పై బీజేపీ విమర్శ.
వ్యాఖ్య :- ***ఆయన మెతకతనమే మీకు కలిసొస్తుంది.***

వార్త :- గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే. – లోక్‌సత్తా పార్టీ నిర్ణయం.
వ్యాఖ్య :- ***ప్రజల మధ్య ఉండాలనుకుంటే అసలు పోటీతో పనేముంది.***

వార్త :- అభయ నిందితులకు 20ఏళ్ల జైలు. – రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు.
వ్యాఖ్య :- ***శిక్షలు వేయడం కాదు, పక్కాగా అమలు చేయాలి.***

వార్త :- నన్ను ఓడించేందుకు సీపీఎం కుట్ర. – సీపీఐ నారాయణ.
వ్యాఖ్య :- ***ఆడలేక మద్దెల ఓడు అంటే ఇదే...!***

# 'నిమ్మ'ను పిండితే.. కన్నీరే!

*జిల్లాలో ఇప్పుడు నిమ్మ రైతులను కదిలిస్తే చాలు..కన్నీళ్ళు బొటబొటా రాలుతున్నాయి. అలివిగాకుండా కాసే నిమ్మచెట్లు గుక్కెడు నీళ్ళు లేక నిలువునా ఎండిపోతున్నాయి. నిమ్మతోటల్లోకి వెళ్తేచాలు.. ఏదో 'వృక్షాస్థిపంజరాలను' చూసినట్లుంటుందే తప్ప...*

- నిమ్మ రైతులకు 'కరెంట్'షాక్
- ధర వున్నా... దిగుబడి లేదు
- సాగునీరు లేక కుదేలైన రైతన్న



చల్లని గాలులతో పచ్చని చెట్లు మచ్చుకైనా కనిపించడం లేదు. ఏదో అగ్నిప్రమాదం జరిగినట్లు.. చెట్లు కాలి పోయినట్లు..ఎండిపోయి కనిపిస్తున్నాయి. నిమ్మకాయలు గిటకబారిపోయి, ఎంత పిండినా స్పూనుడు రసం వచ్చేట్లు కనిపిం చడం లేదు. కన్నబిడ్డల్లాగా పెంచుకున్న చెట్లు..చేతికి అందివచ్చే సమయంలో.. కళ్ళముందే నిట్టనిలువునా ఎండిపోతున్నా యంటూ రైతులు పుట్టెడు శోకంతో కుమిలి పోతున్నారు. ఇంతట దయనీయస్థితి ఏనాడూ దాపురించలేదని రైతులు కంట నీరు పెట్టుకుంటున్నారు. అయినా, ఎవరికీ దయ కలగడం లేదు. సేద్యానికి ఇబ్బంది లేకుండా ఏడుగంటల పాటు కరెంట్ ఇస్తా మని చెప్పిన అధికారులు, ఎటు వెళ్తున్నారో అడ్రస్ వుండడం లేదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కరెంట్ కోసం ఫోన్ చేస్తే, అసలు అవతలపక్క ఫోన్ ఎత్తే వారే లేరని వారు బాధపడుతున్నారు. ఎప్పుడు కరెంట్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక, కరెంట్ రాగానే మోటార్లు వేసి నీళ్ల పట్టుకుందామని, పగలూ- రాత్రుళ్లూ తోటల్లోనే కాపలా కాసి.. కాసీ.. కళ్లు కాయలు కాసిపోతు న్నాయి. అయినా, విద్యుత్‌శాఖవారు నిమ్మకు నీరెత్తినట్లు మౌనరాగం ఆలపి స్తున్నారు. ఒక పక్క వానల్లేక, మోటార్లు వేసుకుందామంటే విద్యుత్ లేక, చివ రికి తోటల్లో చెట్లకు నీళ్ళు లేక, పచ్చగా కళకళలాడాల్సిన చెట్లు ఎండుముఖం పెట్టి తమవైపే దీనంగా చూస్తుంటే..రైతన్నల ఆవేదన వర్ణనాతీతం. సాధారణంగా, జిల్లా లోని మెట్ట ప్రాంతాల్లో ఈ సీజన్‌లో నిమ్మ కాయలకు మంచి డిమాండ్ వుంటుంది. గూడూరు తదితర ప్రాంతాల నుంచి నిమ్మ కాయలు భారీగా దూరప్రాంతాలకు ఎగుమతి కూడా అవుతుంటాయి. అందు లోనూ, దిగుబడి బాగా వచ్చే సీజన్ కూడా ఇదే. అయితే, ఈ సారి రైతుల దురదృష్ట మేమిటంటే, గతంలో ఎప్పుడూ లేనంతగా నిమ్మకాయలకు మంచి ధర వచ్చింది. గతంలో బస్తాడు నిమ్మకాయలు 3,500 నుంచి 4 వేల రూపాయల దాకా వుండేది. ఈసారి ఒక్కసారిగా రికార్డు స్థాయిలో రెండింతలై, బస్తా నిమ్మ ధర దాదాపు 8 వేల దాకా పలుకుతోంది. ఇంత మంచి ధర వచ్చిందని రైతన్నలు ఆశ పడాల్సిందే కానీ, తోటల్లో చెట్లకు కాయలేవీ? ఎండి పోయిన చెట్టకొమ్మల్లో వుందామా?.. రాలి పోదామా? అన్నట్లు చిన్ని చిన్ని గోళీ కాయల్లా సైజు తగ్గిపోయి, గిటకబారి పోయిన నిమ్మకాయలకు మంచి ధర ఎవరి స్తారు? వీటిల్ని మార్కెట్‌కు మోసుకు పోవడం కూడా దండగే అన్నట్లుంది పరిస్థితి. అసలు చెట్లకు నీళ్లుంటే కదా..అవి మంచి సైజు రావడానికి? ఇన్నాళ్ళకి ఇన్నేళ్ళకి మంచి ధర వచ్చిందని సంబరప డాల్నా.. లేక కాయలే లేక ఖాళీ గోతాల్ని చూసి ఏడవాల్నా.. ఇదీ మెట్టప్రాంతాల్లోని రైతన్నల దయనీయ స్థితి. ఇలాంటి సంకట స్థితులు రైతులను ఊపిరాడకుండా చేస్తూనే వున్నాయి. బాగా కాపు వున్నప్పుడు మంచి ధర వుండదు. ధర బాగున్నప్పుడు కాపు వుండదు. అవసరమైనప్పుడు అదునుకు పదునైన వానలుండవు, అవసరం లేన ప్పుడు కుండపోత వాన రావడమో, ఈదురు గాలులు కొట్టి ఆ వున్న కాయలన్నిటీ పూడ బెరకడమో చేస్తుంటుంది. జిల్లాలోని రైతన్న లకు ఇలాంటి కష్టాలు బోలెడు. ఇవి తీరే దెప్పుడో ఆ భగవంతునికే తెలియాలి. ఈసారైనా నిమ్మరైతులకు కష్టాలు తప్పు తాయని అనుకుంటే, ఎప్పుడూ లేని సమస్య లన్నీ వచ్చిపడ్డాయి. వానల్లేక, భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. తోటల్లో చుక్క సాగునీరు లేక చెట్లన్నీ ఎండి పోతున్నాయి. ఇక ఎక్కడైనా రెండు బొట్లు నీళ్ళున్నాయంటే, అవి ఆ రైతుల కళ్ళల్లో కన్నీళ్ళుగా మాత్రమే వున్నాయి. తోటలు ఎండిపోయినట్లుగానే వారి ఆశలన్నీ ఎండిపోయాయి. వారి బతుకులన్నీ వాడిపోయాయి. సాధారణంగా జిల్లా లోని గూడూరు చుట్టు పక్కల ప్రాంతాలు, గూడూరు రూరల్, సైదా పురం, పొదలకూరు, వెంకటగిరి, బాలా యపల్లి, డక్కిలి, రాపూరు, కలు వాయి, చేజర్ల, చిల్లకూరు, పెళ్ళకూరు ఇలా అనేక మండలాల్లో విస్తారంగా నిమ్మతోటలు సాగుచేస్తుంటారు. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాలకు పైగానే నిమ్మ సాగవుతున్నట్లు ఒక అంచనా. అయితే, ప్రతిసారీ నిమ్మ కాయల సీజన్ వచ్చినప్పుడల్లా ఏదో ఒక అవస్త నిమ్మరైతులను కన్నీరు పెట్టిస్తూనే వుంది. ఈసారి అసలు రైతుల స్థితిగతుల పట్టించుకునే వారేరీ? విద్యుత్ సమస్య తీవ్రమైంది. మోటార్లు పనిచేస్తే కదా చెట్లకు నీళ్ళు! కరెంట్ సంగతి ఇక చెప్పేదే ముందీ?..అదంతా విద్యుత్ మాయా జాలం. ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో ఆ దేవుడిక్కూడా తెలియదు. కరెంటివ్వండి బాబో అంటూ రైతులు కన్నీళ్ళు పెట్టుకుంటూ వేడుకున్నా వారి మాట ఆలకించేదెవరు?.. ఆచరించే దెవరూ? దీంతో నిమ్మ రైతులు తోట ల్లోంచి రోడ్లమీదికి రాక తప్పలేదు.

అనేక ప్రాంతాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు, ఆందోళనలు చేసినా, రైతుల గోడు పట్టించుకునే నాథులే కనిపించడం లేదు.

అప్పో సప్పో చేసి, ఆరుగాలం కష్టించి, చెమటోడ్చి పనిచేసే రైతన్నలు ఎంతగా ఆక్రోశిస్తున్నా ప్రభుత్వం గానీ, పాలకులు గానీ..వారి బాధలు పట్టించుకోకపోవడం దారుణం.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గూడూరు రెండో పట్టణ పరిధి మాళవ్యానగర్ ప్రాంతంలోని రాజస్ యోగా జిమ్ సెంటర్‌లో యోగాలో శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. యోగాచార్య కట్టా మురళీకృష్ణ ఆధ్వర్యంలో 40రోజుల పాటు ఉదయం, సాయంత్రం నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తోంది. మురళీకృష్ణ మాట్లాడుతూ యోగాతో పాటు ధ్యానంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం యాంత్రిక జీవనంలో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకే సమయం సరిపోతుందని, వ్యాయామం నేర్పడంలేదన్నారు. వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి జ్ఞాపకశక్తి పెరుగుతుందని సంపూర్ణ ఆరోగ్యం సైతం కలుగుతుందని పేర్కొన్నారు.

# కనువిందు చేసిన కాశీవిశ్వనాథుని కల్యాణ మహోత్సవం

నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్ పేటలోని అన్నపూర్ణ, విశాలక్షి సమేత శ్రీ కాశీ విశ్వనాథుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 13న జరిగిన గిన్నెబిక్ష, నందిసేవ మహోత్సవాలు భక్తులకు అత్యంత ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించాయి. ఉత్సవంలో పి.సుధాకర్, పద్మకుమారి, వేమూరు కిషోర్‌కుమార్, అరుణలతలు భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయ పూజారులు స్వామికి, దేవేరులకు మంగళస్నానాలు చేయించి పట్టు పీతాంబరాలు, పూల అలంకరణలు చేసి శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహిం చారు. 14న కల్యాణోత్సవం కడుపసందుగా భక్తులకు కనువిందు చేసింది. కార్యక్రమాలను ఆలయ ఇఓ వి.మధుసూదనరావు పర్యవేక్షించారు.

# గురుకులాల్లో అర్హతకే సీట్లు కేటాయింపు

గతంలో లాటరీ పద్ధతి ద్వారా సీట్ల కేటాయిస్తుండడంతో అర్హులైన విద్యార్థులకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశంలో అన్యాయం జరుగుతుండడంతో కొత్తగా విద్యార్థులకు ఓయంఆర్ షీటు ద్వారా ప్రవేశ పరీక్ష విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతిలో జిల్లాలోని సంగం మినహా మిగిలిన అన్ని గురుకుల పాఠశాలల్లో 4వతరగతి నుంచి 5వతరగతిలో చేరే విద్యార్థులకు ఈనెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించారు. కోట, వాకాడు, చిల్లకూరు, నాయుడుపేట పాఠశాలలకు సంబంధించి పదిహేను వందల మంది ప్రవేశపరీక్ష రాయగా, సూళ్ళూరుపేట, పుదూరు, డక్కిలి, కందలేరు, ముత్తుకూరు, బుచ్చి, గురుకుల పాఠశాలలకు సంబంధించి రెండువేల ఐదొందల మంది బాలికలు పరీక్షల్లో పాల్గొన్నారు. కొత్త విధానం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం ప్రకటించారు.

## ఏపియుడబ్ల్యూజె
# రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జయప్రకాష్



రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుకి ఇటీవల హైదరాబాద్, దేశోద్ధారక భవన్‌లో సీమాంధ్ర 13జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జాతీయ నాయకుల సమక్షంలో అడహక్ కమిటీ ఏర్పాటైంది. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఎ.జయప్రకాష్ ఉపా ధ్యక్షుడిగా ఎంపికయ్యారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా ఉమ్మడి రాష్ట్రం ఏపిడబ్ల్యుజె ఉపాధ్యక్షుడిగా జయప్రకాష్ పని చేసారు. 13జిల్లాల్లో ఏపియుడబ్ల్యుజె అభివృద్ధికి ప్రెస్‌క్లబ్‌ల అభివృద్ధికి ఇళ్ళస్థలాలు, ఆరోగ్యశ్రీ కార్డులు, కొత్త రాజధానిలో యూనియన్ కార్యాలయం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని జయప్రకాష్ ఈ సందర్భంగా ప్రకటించారు. రాష్ట్రం రెండుగా విడిపోవడం వలన ఏపియుడబ్ల్యూజె కూడా రెండు రాష్ట్రాలలో విడివిడిగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. పలువురు జర్నలిస్టులు ఆయనను అభినందించారు.

# రౌతు దిట్ట అయితే...

గ్రీవెన్స్ డేకు గైర్హాజరైన జిల్లా అధికా రుల పట్ల జేసీ రేఖారాణి ఈనెల 12న ఆగ్రహాన్ని ప్రకటించారు. ప్రతి సోమ వారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తుండే గ్రీవెన్స్‌డేలో ఈ సోమవారం ఇరవై ఆరు మంది అధికా రులు మాత్రమే పాల్గొనడంతో గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏఓ రమేష్ నాయుడును ఆమె ఆదేశించారు. పనితీరులో ఆ మాత్రం కరుకుదనం అవసరమే మరి. రౌతు మెత్త నైతే గుర్రం మూడు కాళ్ళ మీద నడుస్తుంది. అదే దిట్ట అయితే నాలుగు కాళ్ళ మీద చక్కగా నడిచి తీరుతుందన్నది జగమెరిగిన సత్యమే, చూద్దాం!

# పెరిగిన డీజిల్ ధర

ఆగదు గాక ఆగదు పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల నిరంతరం కొనసాగు తుండాల్సిందే. దానికి ఏ నెలా మినహా యింపు లేదు. ప్రతినెల కనీసం యాభై పైసలన్నా పెరుగుతూ ఈనెల 12 అర్ధ రాత్రి నుంచి డీజిల్ ధర లీటర్‌పై రూ॥1.09 వంతున టాక్స్‌తో కలిపి రూ॥1.40 పెరి గింది. దీంతో రూ॥60.63 నుండి రూ॥62.03కు చేరుకుంది. ఎలక్షన్ల పండగ అయిపోవడంతోనే కేంద్ర ప్రభుత్వం ప్రజలకు వేడివేడిగా వడ్డించింది. ఈ వడ్డనతో నిత్యావసర సరుకుల ధరలు కూడా పేద, మధ్య తరగతి వారికి చుక్క లను చూపించడం ఖాయం.


## 9వ వర్ధంతి

మరువలేని నీ తీపి జ్ఞాపకాలతో
నిత్యం నీ మధురస్మృతులతో

భర్త
కె.వి.రమణయ్య
సీనియర్ పాత్రికేయులు

కుటుంబ ఉన్నతికి అహర్నిశలు
శ్రమించిన మా యింటి దైవం
ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరి
మంచి కోరుకునే మా ఇంటిదీపం
మా అమ్మను స్మరిస్తూ...




శ్రీమతి కనుపర్తి రమాదేవి

| కుమారులు - కోడళ్లు | కుమార్తెలు - అల్లుళ్లు |
|---|---|
| కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన | సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి |
| మృదుల | మానస, మౌనిక |
| కనుపర్తి దయాశంకర్ - రేణుక | జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహశర్మ |
| నితిన్, నందిక | మేఘన, కౌశిక్ |

## స్టేడియంలో 'వాకర్స్' పౌష్టికాహారం



వేసవి సెలవుల్లో నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న 700 మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9గంటల వరకు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పూండ్ల దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా మే నెల 1వతేదీ నుండి 31వతేదీ వరకు స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులైన విద్యార్థులకు పౌష్టికాహారం సరఫరా చేస్తున్నామని తెలిపారు. మే నెల 8వతేదీ నుండి 31వరకు విద్యార్థులే కాకుండా వాకర్స్ ఎక్సర్‌సైజ్ చేసేవారందరికీ పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బి.శేషగిరిరావు, రాఘవేంద్రషెట్టి, డాక్టర్ ఆర్.శ్రీనివాసకుమార్, వి.రంగారావు, ఎన్.బలరామయ్యనాయుడు, డి.రమణయ్య, నరసింహారెడ్డి, ఎస్.రమేష్, ఎస్.ఏ.గఫార్ తదితరులు పాల్గొన్నారు.

## 'శ్రీ కళాలయ' క్విజ్ పోటీలు



నెల్లూరులోని "శ్రీ కళాలయ" ది గ్రూప్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో వరల్డ్ రెడ్ క్రాస్ డే, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిలను పురస్కరించుకొని విద్యార్థులకు ఈనెల 7, 8తేదీలలో 'లయన్ వై.సుబ్బారావు నేతృత్వంలో ఇన్నోవేటివ్ క్విజ్ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో విజేతలైన పి.సాత్విక్, బి.సాత్విక్, పావనిలకు, జూనియర్స్ విభాగంలో లాస్యప్రియ, ఆనం కృష్ణప్రణవ్‌రెడ్డిలకు బహుమతులందించారు. కార్యక్రమంలో ఆర్టిస్ట్ హరనాథ్, క్రాఫ్ట్ మాస్టర్ బాలు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రీ కళాలయ డైరెక్టర్ గూడూరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అమ్మల దినోత్సవం

నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 11న అంతర్జాతీయ అమ్మల దినోత్సవం సందర్భంగా మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమంచర్లలోని వృద్ధాశ్రమ నిర్వాహకులు జయ ఫిలిప్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాధమ్మ మదర్స్‌డే ప్రాముఖ్యతను వివరించి, మాట్లాడుతూ తల్లిని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. జన్మనిచ్చే మాతృమూర్తులకు జీవితాంతం కృతజ్ఞతగా ఉండాలన్నారు. మన దేశ సంస్కృతి ప్రకారం తల్లిదండ్రులను వారి జీవితాంతం సంతానమే తమ దగ్గర పెట్టుకొని చూడాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోశాధికారి వసుంధర, డాక్టర్ అంకిరెడ్డి, గౌరవాధ్యక్షులు అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ధర్నా!



సోమవారం నెల్లూరులోని డికెడబ్ల్యూ కళాశాలలో మొదట కౌంటింగ్ హాల్స్ వద్దకు విలేకరులకు అనుమతినివ్వలేదు. కేవలం ప్రిన్సిపాల్ గది వద్ద ఏర్పాటు చేసిన మీడియా సెల్ వరకు మాత్రమే అనుమతిచ్చారు. దీంతో జర్నలిస్టులు ధర్నాకు దిగారు. కొద్దిసేపటికి విలేకరులందరినీ కౌంటింగ్ హాల్స్ వద్దకు అనుమతించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

# నెల్లూరు కబుర్లు

## కెవ్వు కేక...

శుక్రవారం ఉదయం నెల్లూరులోని డికెడబ్ల్యూ కళాశాల వద్ద, అలాగే కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. నెల్లూరు పార్లమెంట్, నెల్లూరు నగరం, రూరల్, ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, కోవూరు అసెంబ్లీల ఓట్ల లెక్కింపు డికెడబ్ల్యూ కాలేజీ వద్ద జరుగగా, తిరుపతి పార్లమెంట్, సర్వేపల్లి, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి అసెంబ్లీల కౌంటింగ్ ప్రియదర్శిని కాలేజీలో జరిగింది. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఇరు పార్టీల కార్యకర్తలు లెక్కింపు కేంద్రాల వద్ద వేలసంఖ్యలో మోహరించారు. తమ అభ్యర్థులకు అనుకూలంగా ఒక్కో రౌండ్‌లో ఫలితాలు వెలువడే కొద్దీ రచ్చరచ్చ చేసారు.

## రక్తదాతలు స్పందించాలి

నెల్లూరు చిన్నబజారులో ఈనెల 11న వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అలాగే రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో జిమ్ వంశీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా రక్త నిల్వలు తగ్గాయని, ఈ రక్తదాన శిబిరాల వల్ల రక్తనిల్వలు అవసరాలకు సరిపడా పెరిగి రోగులకు అందించగలుగుతామని పేర్కొన్నారు. ఎండాకాలంలో రక్త అవసరాలు ఎక్కువగా వుంటాయని రక్తదాతలు స్పందించి సహకరించాలని కోరారు. చిన్నబజారు రక్తదాన శిబిరంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, వాసవిక్లబ్ అధ్యక్షుడు వెంకటకిషోర్ కుమార్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం. బ్లడ్ మోటివేటర్ బయ్యా ప్రసాద్, చిన్ని శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ రోగులకు ఫలహారాలు



నెల్లూరు దర్గామిట్టలోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఈనెల 11న ముస్లిం యూత్ సభ్యులు రోగులకు పండ్లు, పండ్ల రసాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం యూత్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.ఖాలీద్ మాట్లాడుతూ రజ్జబ్‌నెల సందర్భంగా పాకిస్థాన్ జైళ్ళలో మగ్గుతున్న భారతీయులను విడుదల చేయించే దిశలో కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ఖైదీల తరపున దువా చేసి రోగులకు ఫలహారాలను పంచిపెట్టామని తెలిపారు. కార్యక్రమంలో గోల్డ్‌స్మిత్ ఎజాజ్, కె.జి.ఎన్.ఫ్రూట్స్ మున్నా, క్యాటరింగ్ ఇస్సాక్, మైను, కంతర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 12వ తేదీన డి.కె.డబ్ల్యూ కళాశాలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

## ఇఫ్కోకు కొత్త మేనేజర్

ఇఫ్కో ఎరువుల సంస్థ నెల్లూరు కార్యాలయం సీనియర్ ఏరియా మేనేజర్‌గా జి.మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

## కార్లు ధ్వంసం

సోమవారం రాత్రి నెల్లూరు బంగ్లాతోటలోని క్రాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ నిలిపివున్న మూడు కార్లను ధ్వంసం చేసారు. క్రాంతి స్కూల్ నిర్వాహకులు అన్వర్‌బాషా కారుతో పాటు ప్రొవిజన్ షాపు నిర్వాహకుడు శేఖర్, మరోవ్యక్తి కారు ధ్వంసమయ్యాయి. దీనిపై రెండో నగర పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు

నెల్లూరులోని డికెడబ్ల్యూ కళాశాలలో ఈనెల 12న జరుగుతుండిన ఓట్ల లెక్కింపును ఎన్నికల పరిశీలకులు రవిచంద్ర, జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అలగవర్షిణిలు పరిశీలించారు. లెక్కింపు కేంద్రాలలో ఏర్పాట్లపై కమిషనర్ శ్యాంసన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రతతో లెక్కింపు గదులలో సిబ్బంది ఉక్కపోతతో అల్లాడిపోయారు. కానీ తప్పని స్థితి. మొత్తమ్మీద ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరిగి ఫలితాలు ప్రకటించారు.

## విలేకరుల ఆకలి కేకలు

సోమవారం మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రమైన డికెడబ్ల్యూ కాలేజీలో విలేకరులు ఆకలితో నకనకలాడాల్సి వచ్చింది. ఉదయం 8గంటలకే కౌంటింగ్ కావడంతో విలేకరులు ఆదరాబదరా రెడీ అయ్యి 7గంటలకల్లా కౌంటింగ్ కేంద్రం వద్దకు ఖాళీ కడుపులతో వచ్చారు. ప్రతిసారి ఇక్కడ జర్నలిస్టులకు టిఫిన్, టీ అందజేస్తుండేవాళ్లు. ఈసారి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదు. ఆకలిని భరిస్తూనే చాలామంది విలేకరులు విధులు నిర్వహించాల్సి వచ్చింది.

## ఎండను సైతం లెక్క చేయక...

ఇప్పుడు కాస్తున్న ఎండలకు భవంతులు, చెట్ల క్రింద ఉంటేనే చెమట్లు కారుతున్నాయి. అలాంటిది గంటల తరబడి ఎండలో నిలుచోవాలంటే మాటలా? కాని సోమవారం చాలా మంది ఆయా పార్టీల అభిమానులు డికెడబ్ల్యూ కాలేజీ వద్ద గంటల తరబడి ఎండలో నిలుచున్నారు. ఆయా పార్టీల తరపున కార్పొరేటర్‌లు, కౌన్సిలర్లుగా పోటీ చేసిన తమ వారి గెలుపు వార్త కోసం గంటల తరబడి ఎండలోనే నిలబడి ఎదురు చూశారు. గెలిచిన అభ్యర్థులు బయటకు రాగానే తమ భుజాలపైకెత్తుకుని ఊరేగించారు.

## పవర్ హాలిడే ఎత్తేశారు

సదరన్ డిస్కం పరిధిలోని పరిశ్రమలకు పవర్ హాలిడే నుండి మినహాయింపునిస్తున్నట్లు ఆ సంస్థ సిఎండి హెచ్.వై. దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మినహాయింపు వల్ల నెల్లూరు జిల్లాలోని పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. జిల్లాలో వ్యవసాయానికి మెరుగైన విద్యుత్‌ను అందించాలన్న ఉద్దేశ్యంతోనే ఇప్పటివరకు పరిశ్రమలకు పవర్ హాలిడే అమలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు, డిమాండ్‌కు వ్యత్యాసం తగ్గుతున్న కారణంగా పవర్ హాలిడేను ఎత్తేస్తున్నామన్నారు.

### నేదురుమల్లి మృతికి
## జయ సంతాపం

మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మృతిపట్ల జై సమైక్యాంధ్ర పార్టీ నెల్లూరు నగర సమన్వయకర్త ఆనం జయకుమార్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మన రాష్ట్రానికి నెల్లూరుజిల్లాకు, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేశారని అటువంటి వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం విచారకరమన్నారు. ఆ పెద్దాయనకు తమ కుటుంబంతో ఎంతో ఆత్మీయ సంబంధాలున్నాయని, ఆయన మృతి తమనెంతగానో బాధించిందని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అయ్యబాబోయ్... ఎండలు

వేసవికాలం ప్రతాపం చూపిస్తుంది. మండిపోతున్న ఎండల ధాటికి జనం ఠారెత్తిపోతున్నారు. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10గంటలు దాటిందంటే రోడ్ల మీద తిరిగే పరిస్థితి లేకుండా పోతోంది. మిట్టమధ్యాహ్నం గట్టిగా అరగంట ఎండలో తిరిగారంటే ఎవరికైనా కళ్లు బైర్లు కమ్మడం ఖాయం. మండే ఎండలతో ఇళ్లల్లోనూ సెగలు రేగుతున్నాయి. దీనికి కరెంట్ కోతలు తోడవుతుండడంతో జనం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రాత్రివేళల్లో కూడా ఇళ్లల్లో వేడి తగ్గడం లేదు.

ఎండల దెబ్బకు ఎలక్ట్రానిక్ అంగళ్లలో ఏ.సిలు, ఎయిర్ కూలర్‌లు ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి. ఈ ఎండలకు తాళలేక చాలామంది తమ పిల్లలతో చల్లటి ప్రాంతాలకు విహారయాత్రల కోసం వెళుతున్నారు.

- సారధ్యం వారిది... ప్రాతినిధ్యం మీది...

# వెంకయ్యా!.. ఈ జిల్లా ప్రగతికి మీరే దిక్కయ్యా!





జన హృదయనేత, అభివృద్ధి ప్రదాత నరేంద్ర మోడీకి దేశవ్యాప్తంగా ప్రజలు తిరుగులేని ఆధిక్యతను ఇచ్చారు. ఆయనకు అఖండ విజయం చేకూర్చి.. జయజయధ్వానాలతో 'జయహో'.. అంటూ దీవించారు. సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాశ్రేయస్సు కోసం అహరహం పనిచేస్తానని, అవినీతి, అక్రమాల భరతం పడతానని ప్రతినబూనిన ఆ ప్రజానేతకు ప్రజలు హారతులు పట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే దేశవ్యాప్తంగా ప్రజలు ప్రగతికి పట్టాభిషేకం చేశారు. దేశంలో ఉద్దండులనుకున్న అనేకమంది ప్రత్యర్థి నాయకులు సైతం మోడీ ప్రభంజనం ధాటికి తట్టుకోలేకపోయారు. కాంగ్రెస్ అవినీతి అక్రమాలపై సమర శంఖం పూరించిన భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యతతో అప్రతిహతంగా..దిగ్విజయంగా ముందుకు సాగింది. దేశంలో ఎక్కడ చూసినా అవినీతి పెచ్చురిల్లుతున్న వేళ, ఏ ప్రాంతంలో చూసినా రకరకాల కుంభకోణాలు వెల్లువెత్తుతున్న వేళ, సామాన్యప్రజల బ్రతుకే దుర్భరమవుతున్న వేళ..కారుచీకటిలో కాంతిరేఖలా ఎన్నికలొచ్చాయి. మరోవైపు రాష్ట్రం కూడా సమస్యల సుడిగుండాల్లో పడి విలవిల లాడుతోన్న సమయం..రాష్ట్రం విభజనకు సమాయత్తం అవుతున్న నేపథ్యం...అటు దేశానికీ, ఇటు రాష్ట్రానికీ ఎంతో కీలకమైన ఎన్నికల సన్నివేశం!.. కాకలు తీరిన కాంగ్రెస్ నేతలు ఒకవైపు, కమలనాథులు మరోవైపు... ఇక ప్రజలెవరివైపో ప్రజలే నిర్ణయించుకోవాల్సిన తరుణం రానే వచ్చింది. అభివృద్ధి వైపా?. అవినీతి వైపా?.. కుట్రలు కుతంత్రాలు, కుంభకోణాల రాజకీయాలు కావాలా?.. ప్రజల అభ్యున్నతికి బాటలు వేసే రాజకీయాలు కావాలా?.. అంటూ బిజెపి నేతలు ప్రచార రంగంలో దేశవ్యాప్తంగా ప్రస్తావించిన అనేక అంశాలు ప్రజలను బాగా ఆలోచింపజేశాయి. ప్రధానంగా మోడీ చేసిన ప్రసంగాలకు ప్రజలు బాగా ప్రభావితమయ్యారు. ఆయన ఏ సభలో ప్రసంగించినా ఆ సభంతా ప్రజల కరతాళ ధ్వనులతో మారుమ్రోగిపోయేది. ఆయనను చూస్తేనే ప్రజల్లో ఉత్సాహం ఉరకలెత్తేది. దేశ భవిష్యత్తుకు ఆయన సరైన మార్గదర్శకులనే భావం ప్రజల హృదయాల్లో నిలచిపోయింది. దాంతోనే మోడీ అఖండవిజయం సాధిస్తారనేది అప్పుడే...అందరికీ స్పష్టమైపోయింది. ఇప్పుడు..ప్రజలు అనుకున్నట్లుగానే అంతా జరిగింది. ప్రజల కలలు సాకారం అయ్యే మంచిరోజులు వచ్చేశాయి. ఇన్నాళ్ళ నాటి.. ఇన్నేళ్ళనాటి ప్రజల ఆశలు తీరే శుభఘడియలు అత్యంత చేరువకు వచ్చేశాయి. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభంజనంతో, ఇక రాష్ట్రం ప్రగతిబాట పడుతుందనే నిశ్చింత ప్రజల్లో కలుగుతోంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేసే నాయకుడు, ప్రత్యేకించి సీమాంధ్ర అభివృద్ధి ప్రదాత, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తిరిగి అధికారంలోకి రావడమంటే, రాష్ట్రంలో ఇక ప్రగతి వెలుగులు విరజిమ్మే చంద్రోదయం అయినట్లే...రాష్ట్రానికి ఇక నవోదయం వచ్చినట్లే.

ఈ నేపథ్యంలో అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఇద్దరు మహానాయకులు వుండగా, ఇక ప్రత్యేకించి నెల్లూరుజిల్లా ప్రగతికి మరింతగా చేయూతనిచ్చి, జిల్లాను ప్రగతి పథంలో నడిపింపజేసే సత్తా.. సామర్థ్యం వున్న మహానాయకుడు మన ముప్పవరపు వెంకయ్యనాయుడు. ఆయన మన నేత.. అభివృద్ధి ప్రదాత.. దేశవ్యాప్త ఖ్యాతి పొందిన బిజెపి అగ్రనేత. తాను అధికారంలో వున్నా... లేకున్నా జననీ.. జన్మ భూమిశ్చ అన్నట్లుగా.. స్వస్థలమైన ఈ జిల్లా అభ్యున్నతికి అహరహం తపించే తత్వం వున్న మహోన్నత నేత ఆయన. భారతావని ప్రతిష్టను దశదిశలా మారుమ్రోగించాలనే తాపత్రయంలో నరేంద్రమోడీ ప్రచారరంగంలో ఉరకలు వేస్తుండగా, ఆయన వెంట అనేక సభల్లో సమావేశాల్లో పాల్గొని తన ప్రత్యేకతను చాటుకున్నారు. దేశంలో బిజెపి ఆశయాలను స్పష్టంగా వివరిస్తూ, పార్టీ విజయానికి తన వంతు శ్రమించిన నాయకులాయన. ప్రజల ఆశా కిరణం మోడీ..ప్రధాని పీఠాన్ని అధిష్టిస్తున్న నేపథ్యంలో, ఈ జిల్లాను ప్రగతిబాటలో ముందంజ వేయించేందుకు వెంకయ్యనాయుడు తీసుకునే చొరవే ఎంతో కీలకం కాబోతోంది కూడా. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ జిల్లా ప్రగతికి ఇక వెంకయ్యే దిక్కు!.. ఈ జిల్లాలో జన్మించి, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి, రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదిగిన మహానేత మన వెంకయ్యనాయుడు. అందులోనూ ఎన్నో ఆటుపోట్లను అధిగమించి, జీవితమంతా అలుపెరగని పోరాటం చేస్తూ..ఒక్కోసారి తానే అంతాగా వున్నా..కొన్ని సందర్భాల్లో తానొక్కడే ఒంటరిపోరాటం చేసినా.. ఆయన ధ్యేయం.. ఆశయం.. సంకల్పం అంతా రాష్ట్ర ప్రజల అభ్యునతిపైనే. ముఖ్యంగా జిల్లా అభివృద్ధి పైనే. రాష్ట్ర విభజన బిల్లు లోక్‌సభ ఆమోదానికి వచ్చినప్పుడు, ప్రత్యేకించి సీమాంధ్ర ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం వెంకయ్యనాయుడు చేసిన చర్చ, కృషి.. అమోఘం!.. అపారం!. సీమాంధ్రకు నిర్దిష్టమైన ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వాని నిలదీసిన ఆయన తీరు.. ఆయన పడిన తపన..ఇక్కడి ప్రజల మనసుల్లో నిలిచిపోయింది. సీమాంధ్ర అభివృద్ధికై ఇచ్చిన హామీలను వెంటన అమలు చేయాలని ఆయన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులైన డా.మాంటెక్ సింగ్ అహ్లువాలియాను కలసి విన్నవించిన విషయం అందరికీ తెలిసిందే! సీమాంధ్రలో స్థాపించ తలపెట్టిన ఐఐటి, ఐఐఐటి, ఎన్ఐటి, ఐఐఎం, ఐఐఎస్ఇఆర్, కేంద్రీయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ విశ్వవిద్యాలయం వంటి సంస్థలు స్థాపించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎయిమ్స్ తరహా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని సీమాంధ్రలో నెలకొల్పాలని, సీమాంధ్రలో జాతీయ విపత్తుల నివారణ యాజమాన్య సంస్థను ఏర్పాటు చేయాలని, మన జిల్లాలోని దుగరాజపట్నంలో భార ఓడరేవు నిర్మించాలని, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుచేయాలని, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో విస్తరించాలని, సీమాంధ్రలో కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని, విశాఖ, విజయవాడ, గుంటూరు, తెనాలి నగరాల పరిధిలో కేంద్రం మెట్రో రైల్వే వ్యవస్థను ఏర్పాటుచేయాలని తదితర బృహత్తర కార్యక్రమాల అమలుకోసం ఆయన ప్రణాళికా సంఘ కార్యాలయానికి వెళ్ళి, ఆ మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సీమాంధ్రను స్వర్ణాంధ్రగా చేసే బాధ్యత బిజెపికి వుందని, బిజెపి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుందని ఆయన పలు సందర్భాల్లో ప్రజలకు హామీ ఇచ్చారు కూడా. కేంద్రప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా, తెలుగుజాతి సిగ్గుపడేలా రాష్ట్ర విభజన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకుందని ఆయన అనేక సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలపై, రాష్ట్ర అభ్యున్నతిపై, ప్రత్యేకించి ఈ జిల్లా అభివృద్ధిపై ఆయనకు నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. ఇలాంటి నేత మన జిల్లావాసి కావడం మనందరికీ గర్వకారణం. మహానేత మోడీ సారథ్యంలో భారతావని కీర్తి పతాకం దశదిశలా రెపరెపలాడాలి. తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో సీమాంధ్ర ప్రగతి వెలుగులు విరజిమ్మాలి. ఈ ఇద్దరు మహానాయకుల మధ్య, సీమాంధ్ర ప్రజలకు వారధిగా, జిల్లా ప్రగతికి బాసటగా వుంటూ మన ప్రియతమ నేత వెంకయ్యనాయుడు ఈ జిల్లాను కూడా అబివృద్ధిలో అగ్రగామిని చేసి.. జిల్లా ప్రజల మనసుల్లో మరింత సుస్థిర స్థానం సాధించుకోవాలనేది.. ఇక్కడి ప్రజలందరి ఆశ.. ఆకాంక్ష!

ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో రాష్ట్రంలో గాలి ఓ వైపు వీస్తే నెల్లూరులో మాత్రం మరోవైపు వీచింది. ఇది నెల్లూరీయుల దురదృష్టమైనప్పటికీ దేశంలో 'మోడీ'పాలన, మోడీ వంటి సమర్థ నాయకుల పరిపాలనలో వెంకయ్యనాయుడు వంటి వ్యక్తుల భాగస్వామ్యం జిల్లాకు ఓ వరం. ఇక నెల్లూరు జిల్లాని ప్రగతి పట్టాలపై పరుగులు పెట్టించాల్సిన నాయకుడు వెంకయ్య ఒక్కరే. రాష్ట్రం రెండుగా విడిపోయి ఆంధ్రప్రదేశ్ దిక్కు దిశా లేకుండా వున్న తరుణంలో సీమాంధ్రలోని మిగిలిన ప్రాంతాలతో సమానంగా నెల్లూరును అభివృద్ధి చేసుకోవాలి. కొన్ని దశాబ్దాలుగా ఒకే కుటుంబ ఆధీనంలో నరకకూపంగా మారిపోయిన నెల్లూరు నగరాన్ని మోడల్ సిటీగా మార్చుకోవాలి. వందల కిలోమీటర్ల తీరప్రాంతం వున్న జిల్లాని పారిశ్రామిక కారిడార్‌గా చేసుకోవాలి. ఆధ్యాత్మిక పరంగా ఆహ్లాదపరంగా జిల్లాకు పర్యాటక ప్రాముఖ్యతను పెంచి ఆకట్టుకోవాలి. ఇవన్నీ చేయగలిగిన తరుణం ఇదే... చేయగలిగిన నాయకుడు ఒక్కడే... అందుకే అంటున్నాం... వెంకయ్యా!... ఈ జిల్లా ప్రగతికి మీరే దిక్కయ్యా!..




# నెల్లూరు కార్పొరేషన్‌పై జగన్ జెండా

నెల్లూరు నగరపాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ విజయదుందుభి మోగించింది. మొత్తం 54డివిజన్‌లకుగాను 32డివిజన్‌లలో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించి, పూర్తి ఆధిక్యత సంపాదించారు. మేయర్ పీఠం కోసం తీవ్రంగా పోరాడిన తెలుగుదేశంపార్టీ 17డివిజన్‌లలో మాత్రమే గెలవగలిగింది. ఇక టీడీపీ అనుబంధ సభ్యుడు దొడ్డపనేని రాజనాయుడు 29వ డివిజన్‌లో గెలుపొందారు. అలాగే బీజేపీ రెండుస్థానాల్లో, కాంగ్రెస్ ఒక స్థానంలో, సీపీఎం ఒక స్థానంలో విజయం సాధించాయి. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని 54డివిజన్‌లలో ఎన్నికలు జరిగాయి. నెల్లూరు నగర పరిధిలోని డివిజన్‌లలో వైకాపా కంటే తెలుగుదేశం ఒక మెట్టు పైచేయి సాధించగా నెల్లూరురూరల్ నియోజకవర్గంలో మాత్రం తెలుగుదేశం పరిస్థితి దాదాపు తుడిచిపెట్టుకుపోయినట్లయ్యింది. మైనార్టీ వర్గాలు ఎక్కువగా వుండే పొదలకూరురోడ్డు, మూలాపేట, జెండావీధి, మన్సూర్‌నగర్, సంతపేట ప్రాంతాల్లో తెలుగు దేశంకు ఒకటి అరా డివిజన్‌లు మాత్రమే దక్కాయి. కొన్ని డివిజన్‌లలో అభ్యర్థులు భారీమెజార్టీలతో గెలవగా, ఇంకొన్ని డివిజన్‌లలో అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. చాలాతక్కువ ఓట్లతో ఓడిపోయిన డివిజన్‌లు పదిదాకా వున్నాయి. వైకాపా మేయర్ అభ్యర్థిగా రంగంలో వున్న అబ్దుల్ అజీజ్ 52వ డివిజన్ నుండి అలాగే అతని సోదరుడు అబ్దుల్ జలీల్ 42వ డివిజన్ నుండి భారీమెజార్టీతో విజయం సాధించారు. అలాగే 40వ డివిజన్ వైకాపా అభ్యర్థి పి.రూప్‌కుమార్‌యాదవ్ కూడా భారీమెజార్టీతో విజయం సాధించారు. ఇక తెలుగుదేశంపార్టీ మేయర్ అభ్యర్థి డాక్టర్ జడ్.శివప్రసాద్ 8వ డివిజన్ నుండి, తెలుగుదేశం కార్పొరేటర్ అభ్యర్థి దేవరాల మస్తానమ్మ 10వ డివిజన్ నుండి, కిన్నెరప్రసాద్ 6వ డివిజన్ నుండి భారీ మెజార్టీలతో గెలుపొందడం విశేషం.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎం, బీజేపీలు అంచనాలకు అనుగుణంగా ఫలితాలు సాధించలేకపోయాయి. కాంగ్రెస్ ఒక్క డివిజన్‌కే పరిమితమైంది. అది కూడా ఆనం వివేకా కొడుకు కాబట్టి రంగమయూర్ రెడ్డి 12వ డివిజన్ నుండి గెలిచాడు. కాంగ్రెస్‌కు కనీసం ఐదు డివిజన్‌లు వస్తాయని, మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పాత్ర కీలకమవుతుందని వేసుకున్న అంచనాలు తలక్రిందులయ్యాయి.

| పార్టీ | పేరు | డివిజన్ | మెజార్టీ |
|---|---|---|---|
| వైకాపా | లేబూరు పరమేశ్వర్‌రెడ్డి | 1వ డివిజన్ | మెజార్టీ: 229 |
| తెదేపా | మేకల రామమూర్తి | 2వ డివిజన్ | మెజార్టీ: 1163 |
| తెదేపా | కొత్తూరు శైలజ | 3వ డివిజన్ | మెజార్టీ: 424 |
| తెదేపా | మామిడాల మధు | 4వ డివిజన్ | మెజార్టీ: 550 |
| వైకాపా | ఓబిలి రవిచంద్ర | 5వ డివిజన్ | మెజార్టీ: 454 |
| వైకాపా | ముక్కాల ద్వారకానాథ్ | 6వ డివిజన్ | మెజార్టీ: 475 |
| తెదేపా | కిన్నెర ప్రసాద్ | 7వ డివిజన్ | మెజార్టీ: 1,772 |
| తెదేపా | డా॥ జడ్.శివప్రసాద్ | 8వ డివిజన్ | మెజార్టీ: 1,495 |
| వైకాపా | రాజశేఖర్ | 9వ డివిజన్ | మెజార్టీ: 219 |
| తెదేపా | దేవరాల మస్తానమ్మ | 10వ డివిజన్ | మెజార్టీ: 1,042 |
| వైకాపా | మాదాల ధనమ్మ | 11వ డివిజన్ | మెజార్టీ: 175 |
| కాంగ్రెస్ | ఆనం రంగమయూర్ | 12వ డివిజన్ | మెజార్టీ: 903 |
| వైకాపా | యు.మాధవయ్య | 13వ డివిజన్ | మెజార్టీ: 743 |
| తెదేపా | ఉచ్చి భువనేశ్వరప్రసాద్ | 14వ డివిజన్ | మెజార్టీ: 150 |
| వైకాపా | అంచూరి జానకి | 15వ డివిజన్ | మెజార్టీ: 132 |
| వైకాపా | ఏ.బాల కోటేశ్వరరావు | 16వ డివిజన్ | మెజార్టీ: 277 |
| వైకాపా | యు.మస్తానమ్మ | 17వ డివిజన్ | మెజార్టీ: 285 |
| వైకాపా | దారా సరోజనమ్మ | 18వ డివిజన్ | మెజార్టీ: 65 |
| తెదేపా | నెల్లూరు సునీత | 19వ డివిజన్ | మెజార్టీ: 107 |
| తెదేపా | దాసరి రాజేష్ | 20వ డివిజన్ | మెజార్టీ: 56 |
| తెదేపా | నూనె మల్లికార్జున | 21వ డివిజన్ | మెజార్టీ: 46 |
| తెదేపా | బొల్లినేని శ్రీవిద్య | 22వ డివిజన్ | మెజార్టీ: 411 |
| బీజేపీ | యరబోలు అపర్ణ | 23వ డివిజన్ | మెజార్టీ: 962 |
| వైకాపా | పాతపాటి శ్రీలక్ష్మీ | 24వ డివిజన్ | మెజార్టీ: 2,875 |
| సిపిఎం | బి.పద్మ | 25వ డివిజన్ | మెజార్టీ: 94 |
| వైకాపా | పిగిలం ప్రవీణ | 26వ డివిజన్ | మెజార్టీ: 168 |
| తెదేపా | వెంకటేశ్వర్లు | 27వ డివిజన్ | మెజార్టీ: 328 |
| తెదేపా | మేకల రజిని | 28వ డివిజన్ | మెజార్టీ: 776 |
| ఇండిపెండెంట్ | దొడ్డపనేని రాజా | 29వ డివిజన్ | మెజార్టీ: 1,264 |
| వైకాపా | పావళ్ల మాధవి | 30వ డివిజన్ | మెజార్టీ: 460 |
| వైకాపా | తురకా అనిత | 31వ డివిజన్ | మెజార్టీ: 131 |
| వైకాపా | కె.సంపూర్ణ | 32వ డివిజన్ | మెజార్టీ: 521 |
| వైకాపా | ఎస్.కె.తాజున్నీ | 33వ డివిజన్ | మెజార్టీ: 597 |
| తెదేపా | మన్నెం పెంచలయ్య | 34వ డివిజన్ | మెజార్టీ: 588 |
| వైకాపా | యాకసిరి ప్రశాంత్ కిరణ్ | 35వ డివిజన్ | మెజార్టీ: 883 |
| వైకాపా | షేక్ వహీదా | 36వ డివిజన్ | మెజార్టీ: 453 |
| వైకాపా | బి.శ్రీనివాసులు | 37వ డివిజన్ | మెజార్టీ: 138 |
| వైకాపా | కె.శైలజ | 38వ డివిజన్ | మెజార్టీ: 1,094 |
| వైకాపా | కె.లక్ష్మీసునంద | 39వ డివిజన్ | మెజార్టీ: 6 |
| వైకాపా | రూప్‌కుమార్‌యాదవ్ | 40వ డివిజన్ | మెజార్టీ: 1,578 |
| వైకాపా | గోగుల నాగరాజు | 41వ డివిజన్ | మెజార్టీ: 802 |
| వైకాపా | అబ్దుల్ జలీల్ | 42వ డివిజన్ | మెజార్టీ: 1,402 |
| వైకాపా | ఖలీల్ | 43వ డివిజన్ | మెజార్టీ: 1,202 |
| తెదేపా | పిట్ట సత్యనాగేశ్వరరావు | 44వ డివిజన్ | మెజార్టీ: 63 |
| వైకాపా | డా॥ పుట్టా హారిత | 45వ డివిజన్ | మెజార్టీ: 220 |
| వైకాపా | వేలూరు సుధారాణి | 46వ డివిజన్ | మెజార్టీ: 392 |
| తెదేపా | డి.సుజాతారాణి | 47వ డివిజన్ | మెజార్టీ: 394 |
| వైకాపా | కృష్ణవేణి | 48వ డివిజన్ | మెజార్టీ: 339 |
| వైకాపా | వందవాసి పద్మ | 49వ డివిజన్ | మెజార్టీ: 292 |
| బీజేపీ | కప్పిర ఉమామహేశ్వరి | 50వ డివిజన్ | మెజార్టీ: 134 |
| వైకాపా | ఎం.ప్రశాంత్‌కుమార్ | 51వ డివిజన్ | మెజార్టీ: 651 |
| వైకాపా | అబ్దుల్ అజీజ్ | 52వ డివిజన్ | మెజార్టీ: 1,519 |
| వైకాపా | దేవరకొండ అశోక్ | 53వ డివిజన్ | మెజార్టీ: 290 |
| వైకాపా | షేక్ సల్మా | 54వ డివిజన్ | మెజార్టీ: 1,019 |

# నెల్లూరు జడ్పీ వైకాపా వశం

నెల్లూరుజిల్లా పరిషత్‌పై వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండా రెపరెపలాడింది. సీమాంధ్రలో కడప తర్వాత వైకాపా ఘనవిజయం సాధించింది నెల్లూరుజిల్లాలోనే కావడం గమనార్హం. మొత్తం 46జడ్పీటీసీలకు గాను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ 31జడ్పీటీసీలను గెలుచుకుని పూర్తి ఆధిక్యత సాధించింది. అలాగే తెలుగుదేశం కేవలం 15జడ్పీటీసీలకు మాత్రమే పరిమితమైంది. అలాగే 583ఎంపీటీసీలకు ఎన్నికలు జరుగగా, బ్యాలెట్ పేపర్లకు చెదలు పట్టిన కారణంగా కొండాపురం మండలం తూర్పుయర్రబల్లి ఎంపీటీసీలో రీపోలింగ్‌కు ఆదేశించారు. ఇక ఫలితాలు ప్రకటించిన 582ఎంపీటీసీలలో వైయస్సార్ కాంగ్రెస్‌కు 309, తెలుగుదేశంకు 226, కాంగ్రెస్‌కు 15, బీజేపీకి 4, సీపీఎంకు 6, సీపీఐకి 1 ఎంపీటీసీలు దక్కాయి. వైసిపి జిల్లా పరిషత్ ఛైర్మెన్ అభ్యర్థి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆత్మకూరు జడ్పీటీసీ నుండి ఘనవిజయం సాధించారు. తెలుగుదేశం జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థి వేనాటి రామచంద్రారెడ్డి సూళ్లూరుపేట జడ్పీటీసీ నుండి ఘనవిజయం సాధించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వున్న ఒకే జడ్పీటీసీని తెలుగుదేశం గెలుచుకుంది. ఉదయగిరి నియోజకవర్గంలో 8జడ్పీటీసీలుండగా వైకాపా నాలుగు, తెలుగుదేశం నాలుగు జడ్పీటీసీలను గెలుచుకున్నాయి. గూడూరు నియోజకవర్గంలో 5జడ్పీటీసీలకుగాను అన్నీ వైకాపా ఖాతాలో చేరాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో 6జడ్పీటీసీలుంటే రెండు వైకాపా, నాలుగు తెలుగుదేశం పంచుకున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో 5జడ్పీటీసీలుంటే అన్నీ వైకాపానే గెలుచుకుంది. ఆత్మకూరు నియోజకవర్గంలో ఆరు జడ్పీటీసీలకు గాను వైకాపా అన్నింటిలో గెలిచింది. కోవూరు నియోజకవర్గంలో 5జడ్పీటీసీలుంటే 2వైకాపాకు మూడు తెలుగుదేశంకు దక్కాయి. వెంకటగిరి నియోజకవర్గంలో ఆరు జడ్పీటీసీలలో నాలుగు వైకాపా, రెండు తెలుగుదేశం దక్కించుకుంది. కావలి నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలకు గాను 3వైకాపా ఖాతాలో ఒకటి తెలుగుదేశం ఖాతాలో చేరాయి.



| ఆత్మకూరు | సీతారామపురం | గూడూరు |
|---|---|---|
| బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి | కలివెల జ్యోతి | బొమ్మిరెడ్డి పద్మ |
| వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ |
| మెజార్టీ: 2,935 | మెజార్టీ: 860 | మెజార్టీ: 1,435 |



| పొదలకూరు | వెంకటాచలం | బోగోలు |
|---|---|---|
| బిరదవోలు మహేంద్ర | ఎం.వెంకటశేషయ్య | బాపట్ల కామేశ్వరి |
| వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ |
| మెజార్టీ: 3,293 | మెజార్టీ: 2,298 | మెజార్టీ: 4,832 |



| కలువాయి | ఇందుకూరుపేట | సైదాపురం | బాలాయపల్లి | రాపూరు | ఉదయగిరి | చిల్లకూరు | పెళ్లకూరు |
|---|---|---|---|---|---|---|---|
| బి.అనిల్‌కుమార్‌రెడ్డి | బి.వెంకటరమణయ్య | పొట్లేళ్ల శిరీషా | ఏనుగుల రాములమ్మ | పిల్లకదుపు శకుంతల | ఎల్.ప్రవీణకుమారి | ఓడూరు యమునమ్మ | గునిశెట్టి వెంకటేశ్వర్లు |
| వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ |
| మెజార్టీ: 5,123 | మెజార్టీ: 1,484 | మెజార్టీ: 1,768 | మెజార్టీ: 724 | మెజార్టీ: 2,733 | మెజార్టీ: 477 | మెజార్టీ: 445 | మెజార్టీ: 1,962 |



| బుచ్చిరెడ్డిపాలెం | ముత్తుకూరు | వింజమూరు | కోట | దొరవారిసత్రం | సూళ్లూరుపేట | నెల్లూరురూరల్ | విడవలూరు |
|---|---|---|---|---|---|---|---|
| రొండ్ల జయరామయ్య | నెల్లూరు శివప్రసాద్ | పి.నారాయణరెడ్డి | ఉప్పల ప్రసాద్‌గౌడ్ | ముప్పాళ్ల విజేత | వేనాటి రామచంద్రారెడ్డి | యాకసిరి రమ | చిమటా రమాదేవి |
| వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | టీడీపీ | టీడీపీ | టీడీపీ |
| మెజార్టీ: 1,550 | మెజార్టీ: 1,445 | మెజార్టీ: 565 | మెజార్టీ: 5,709 | మెజార్టీ: 1,094 | మెజార్టీ: 2,210 | మెజార్టీ: 1,811 | మెజార్టీ: 618 |



| అనంతసాగరం | జలదంకి | వాకాడు | అల్లూరు | కలిగిరి | దగదర్తి | వెంకటగిరి | ఓజిలి |
|---|---|---|---|---|---|---|---|
| పెయ్యల సంపూర్ణమ్మ | మేదరమెట్ల శివలీల | బత్తిన ప్రమీల | దండా పద్మావతి | శ్రీరాం శరణ్య | మాలెపాటి పద్మావతి | దట్టం గుర్నాధం | కసుమూరు మంజుల |
| వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | టీడీపీ | టీడీపీ | టీడీపీ | టీడీపీ |
| మెజార్టీ: 6,503 | మెజార్టీ: 1,935 | మెజార్టీ: 5,714 | మెజార్టీ: 143 | మెజార్టీ: 3,175 | మెజార్టీ: 1,394 | మెజార్టీ: 699 | మెజార్టీ: 1,370 |



| కావలి | మనుబోలు | సంగం | తోటపల్లిగూడూరు | కొండాపురం | దుత్తలూరు | కొడవలూరు | నాయుడుపేట |
|---|---|---|---|---|---|---|---|
| ఎస్.పెంచలమ్మ | తిరివీధి రమేష్ | మడగల్ల దేవసహాయం | మన్నెం చిరంజీవులగౌడ్ | దామా మహేష్ | చీదర్ల మల్లికార్జున | ఇరువూరు శ్రీధర్‌రెడ్డి | శ్రీరామప్రసాద్ |
| వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | టీడీపీ | టీడీపీ | టీడీపీ | టీడీపీ |
| మెజార్టీ: 259 | మెజార్టీ: 2,061 | మెజార్టీ: 3,568 | మెజార్టీ: 2,659 | మెజార్టీ: 1,657 | మెజార్టీ: 1,194 | మెజార్టీ: 52 | మెజార్టీ: 2,837 |



| చిట్టమూరు | మర్రిపాడు | చేజర్ల | అనుమసముద్రంపేట | వరికుంటపాడు | కోవూరు | దక్కిలి | తడ |
|---|---|---|---|---|---|---|---|
| దువ్వూరు భారతి | పెనగలూరు చంద్రకళ | షేక్ షల్మాషరీన్ | కుదాని హాజరత్తమ్మ | నూనె వేణి | చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి | రామచంద్రనాయుడు | బొమ్మన శ్రీధర్ |
| వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | వైయస్సార్సీపీ | టీడీపీ | టీడీపీ | టీడీపీ | టీడీపీ |
| మెజార్టీ: 44 | మెజార్టీ: 5,776 | మెజార్టీ: 3,122 | మెజార్టీ: 891 | మెజార్టీ: 3,286 | మెజార్టీ: 3,226 | మెజార్టీ: 2,441 | మెజార్టీ: 2,492 |

## బ్యాలెట్‌కు చెదలు.. అభ్యర్థులకు చిలుం వదులు

చెదపురుగులకు బ్యాలెట్ పేపర్ల టేస్ట్ నచ్చిందేమో... చెదపురుగులు వాటిని తినేసి ఓ ఎంపీటీసీలో రీపోలింగ్‌కు కారణమయ్యాయి. కొండాపురం మండలంలోని తూర్పుయర్రబల్లి ఎంపీటీసీ సెగ్మెంట్‌లోని మూడు పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ పేపర్లకు చెదలు పట్టాయి. మంగళవారం లెక్కింపు కోసం ఈ సెగ్మెంట్‌లోని పొట్టిపల్లి, ఇసుకదామెర్ల, మన్నవారిపల్లి గ్రామాలకు చెందిన బ్యాలెట్ బాక్సులను తెరచిచూడగా అందులోని బ్యాలెట్ పత్రాలకు చెదలు పట్టింది. బ్యాలెట్ పత్రాలు పట్టుకుంటే పొడిపొడి కాసాగాయి. వెంటనే కౌంటింగ్ అధికారులు ఆర్డీఓ వెంకటరమణారెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన వచ్చి బ్యాలెట్‌లను పరిశీలించి వాటిని లెక్కించడం కుదరదని కౌంటింగ్ ఆపేసారు. తూర్పుయర్రబల్లిలోని ఐదు పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్‌కు ఆదేశించారు.

## ఆరోజు మిస్సయ్యింది.. ఈరోజు దక్కింది!



జిల్లా పరిషత్ ఛైర్మెన్ కాబోతున్న బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డికి 2006లోనే ఆ పదవి దక్కి ఉండాల్సింది. కాని ఆరోజు వర్గాధిపత్య రాజకీయాలలో ఆయన పేరు వెనక్కిపోయింది. 2006 జడ్పీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ జడ్పీఛైర్మెన్ అభ్యర్థిగా మొదట ఆదాల రాఘవరెడ్డిని నిర్ణయించారు. ఆరోజు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తన పట్టు నిలుపుకోవడం కోసం ఆదాల రాఘవరెడ్డిని తెచ్చారు. ఆయన నామినేషన్‌కు కూడా రెడీ అయ్యారు. తీరాచూస్తే జిల్లాలోని ఓటర్ల లిస్టులో ఆయన పేరు లేకుండా పోయింది. దీంతో నిబంధనల ప్రకారం పోటీ చేయలేక వెనక్కి వెళ్లిపోయారు. సరిగ్గా అప్పుడే ఆనం సోదరులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రంగంలోకి దించారు. కాని నేదురుమల్లి తన పట్టు విడవకుండా బెంగుళూరులో వున్న బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డికి జడ్పీ పీఠం ఆశచూపి నెల్లూరుకు రప్పించారు. రాఘవను ఏ.ఎస్.పేట జడ్పీటీసీ నుండి పోటీ చేయించారు. ఆనం వాళ్లు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సైదాపురం జడ్పీటీసీ నుండి నిలబెట్టారు. కాకాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాఘవ కూడా ఏ.ఎస్.పేట నుండి గెలిచారు. కాని వర్గాల ఈక్వేషన్‌లో కాకాణియే జడ్పీ ఛైర్మెన్‌గా ముందువరుసలో నిలిచారు. రాఘవకు ఆరోజు జడ్పీ ఛైర్మెన్ ఛాన్స్ మిస్సయ్యింది. దాని తర్వాత ఆయన ఎమ్మెల్సీ కూడా అయ్యారు. ఇప్పుడు తలవని తలంపుగా జడ్పీ ఎన్నికలొచ్చాయి. అనూహ్యంగా మళ్ళీ వైకాపా నుండి ఆయన పేరునే జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిగా ఖరారు చేసారు. జగన్ గాలిలో వైకాపా 31జడ్పీటీసీలు సాధించింది. 5ఏళ్ల క్రితం విఫలమైన జడ్పీ ఛైర్మెన్ కల ఇప్పుడు ఫలించబోతుంది.

# నెల్లూరు మున్సిపాల్టీల్లో నువ్వా-నేనా!

- వెంకటగిరి, నాయుడుపేట తెలుగుదేశం ఖాతాలోకి
- కావలి వైకాపా ఖాతాలోకి
- సూళ్లూరుపేట, ఆత్మకూరు, గూడూరులలో హంగ్ ఫలితాలు
- కీలకం కానున్న కాంగ్రెస్, స్వతంత్రులు మరియు కో-ఆప్షన్‌సభ్యులు

నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని ఆరు మున్సిపాల్టీల్లో జరిగిన ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి వైకాపా ఖాతాలో చేరగా, వెంకటగిరి, నాయుడుపేట మున్సిపాల్టీల్లో తెలుగుదేశం సంపూర్ణ మెజార్టీ సాధించింది. గూడూరు, ఆత్మకూరు, సూళ్లూరుపేటలలో హంగ్ ఫలితాలు రాగా ఈ మున్సిపాల్టీలలో స్వతంత్రులు, కాంగ్రెస్ సభ్యులు, సార్వత్రిక ఎన్నికల తర్వాత ఎంపికయ్యే ఎంపీ, ఎమ్మెల్యేలు కీలకం కానున్నారు. ఛైర్‌పర్సన్‌ల ఎంపికలో వీరికి పాత్ర ప్రాధాన్యత సంతరించుకోనుంది.

## వెంకటగిరి కోట 'దేశం'కే

వెంకటగిరి మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయఢంకా మోగించింది. తెలుగుదేశం గెలుపు ముందు వైయస్సార్ ప్రభంజనం కూడా వెలవెలపోయింది. మొత్తం 25వార్డులకుగాను 21వార్డులలో తెలుగుదేశం అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించారు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కేవలం రెండు వార్డులలో గెలవగా ఇతరులు రెండు వార్డులలో విజయం సాధించారు.

## సూళ్లూరుపేట... ఎవరికీ అందని పీట

సూళ్లూరుపేట మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో ఏ పార్టీకీ పూర్తి మెజార్టీ రాని పరిస్థితి. మొత్తం 23వార్డులకు గాను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ 10వార్డులతో గెలిచింది. కాగా తెలుగుదేశం 9వార్డులలో గెలిచి గట్టిపోటీలో వుంది. రెండు వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు, రెండు వార్డులలో ఇండిపెండెంట్లు విజయం సాధించారు. రేపు ఛైర్మెన్ ఎన్నికలలో వీరిదే కీలకపాత్ర కానుంది.

## గూడూరు... హంగ్‌తో ఖంగ్

తెలుగుదేశంపార్టీకి కంచుకోటలాంటి గూడూరు మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాని పరిస్థితి వచ్చింది. మొత్తం 33వార్డులకు గాను 16వార్డులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, 16వార్డులను తెలుగుదేశం పార్టీ గెలుచుకుని సమంగా నిలిచాయి. కాగా ఇండిపెండెంట్‌గా ఒకరు గెలిచారు. ఇక్కడ ఛైర్మెన్ ఎంపికలో స్వతంత్ర్య అభ్యర్థి పాత్ర కీలకం కానుంది.

## దేశంకు పెట్టని కోట... నాయుడుపేట

నాయుడుపేట నగరపాలక పంచాయితీకి తొలిసారిగా జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ మోత మోగించింది. మొత్తం 20వార్డులకు గాను 14వార్డుల్లో తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించగా కేవలం 6డివిజన్‌లలో మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగలిగారు.

## కావలిలో వైసిపి హవా!

కావలి మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ హవా నడిచింది. మొత్తం 37వార్డులకు గాను 21వార్డుల్లో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. తెలుగుదేశం 16వార్డులలో గెలిచి గట్టిపోటీనే ఇచ్చింది. పీఠం మాత్రం వైసిపిదే!

## ఆత్మకూరు... హంగ్ ఫలితాలు

ఆత్మకూరులో మున్సిపాల్టీకి తొలిసారి ఎన్నికలు జరిగాయి. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఏకపక్షంగా ఓటింగ్ జరిగిందనుకున్నారు. తీరా ఫలితాలు చూస్తే పోటాపోటీగా నడిచాయి. మొత్తం 23వార్డులకు గాను వైయస్సార్ కాంగ్రెస్ 10వార్డులను గెలుచుకుంది.

ఏ మున్సిపాల్టీలోనూ ఉనికి చాటుకోని కాంగ్రెస్‌పార్టీ మాత్రం ఇక్కడ 8వార్డులను గెలుచుకుంది. తెలుగుదేశం నాలుగువార్డులను, స్వతంత్రులు ఒక వార్డు గెలుచుకున్నారు. ఛైర్మెన్ ఎంపికలో టీడీపీ, స్వతంత్రులు కీలకం కానున్నారు.

| | మునిసిపాలిటీ | వార్డులు | టీడీపీ | వైసీపీ | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|---|---|
| 1 | నెల్లూరు కార్పొరేషన్ | 54 | 17 | 32 | 1 | 4 |
| 2 | కావలి మున్సిపాలిటీ | 40 | 16 | 20 | 2 | 2 |
| 3 | గూడూరు మున్సిపాలిటీ | 33 | 16 | 16 | - | 1 |
| 4 | ఆత్మకూరు మున్సిపాలిటీ | 23 | 4 | 10 | 8 | 1 |
| 5 | వెంకటగిరి మున్సిపాలిటీ | 25 | 21 | 2 | 1 | 1 |
| 6 | నాయుడుపేట మున్సిపాలిటీ | 20 | 14 | 6 | - | - |
| 7 | సూళ్లూరుపేట మున్సిపాలిటీ | 23 | 9 | 10 | 2 | 2 |
| | **మొత్తం** | **218** | **98** | **95** | **14** | **11** |

## ఎంపీటీసీల ఫలితాలు

| మండలం | ఎంపీటీసీలు | తెదేపా | వైకాపా | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|---|
| **ఉదయగిరి** | | | | | |
| ఉదయగిరి | 10 | 3 | 7 | 0 | 0 |
| వరికుంటపాడు | 9 | 7 | 7 | 0 | 1 |
| సీతారాంపురం | 7 | 2 | 5 | 0 | 0 |
| కలిగిరి | 13 | 9 | 4 | 0 | 0 |
| వింజమూరు | 12 | 5 | 6 | 0 | 1 |
| కొండాపురం | 11(1ఆగింది) | 7 | 3 | 0 | 0 |
| జలదంకి | 13 | 3 | 10 | 0 | 0 |
| దుత్తలూరు | 8 | 5 | 2 | 0 | 1 |
| **ఆత్మకూరు** | | | | | |
| ఆత్మకూరు | 9 | 2 | 5 | 1 | 1 |
| అనంతసాగరం | 12 | 1 | 9 | 2 | 0 |
| చేజర్ల | 10 | 2 | 8 | 0 | 0 |
| మర్రిపాడు | 12 | 1 | 9 | 2 | 0 |
| సంగం | 13 | 3 | 10 | 0 | 0 |
| ఏఎస్‌పేట | 10 | 6 | 3 | 1 | 0 |
| **సర్వేపల్లి** | | | | | |
| టీపీగూడూరు | 14 | 4 | 10 | 0 | 0 |
| ముత్తుకూరు | 17 | 6 | 9 | 0 | 2 |
| వెంకటాచలం | 18 | 4 | 12 | 0 | 2 |
| మనుబోలు | 11 | 4 | 6 | 0 | 1 |
| పొదలకూరు | 19 | 7 | 12 | 0 | 0 |
| **గూడూరు** | | | | | |
| గూడూరు | 16 | 7 | 9 | 0 | 0 |
| చిల్లకూరు | 15 | 5 | 6 | 2 | 2 |
| కోట | 16 | 2 | 11 | 2 | 1 |
| వాకాడు | 11 | 0 | 8 | 3 | 0 |
| చిట్టమూరు | 12 | 7 | 3 | 0 | 2 |
| **వెంకటగిరి** | | | | | |
| వెంకటగిరి | 8 | 4 | 4 | 0 | 0 |
| బాలాయపల్లి | 10 | 3 | 6 | 1 | 0 |
| డక్కిలి | 12 | 8 | 4 | 0 | 0 |
| కలువాయి | 12 | 2 | 10 | 0 | 0 |
| రాపూరు | 13 | 4 | 8 | 1 | 0 |
| సైదాపురం | 12 | 5 | 7 | 0 | 0 |
| **కోవూరు** | | | | | |
| ఇందుకూరుపేట | 17 | 10 | 6 | 0 | 1 |
| విడవలూరు | 14 | 10 | 3 | 0 | 1 |
| కొడవలూరు | 14 | 4 | 8 | 0 | 2 |
| బుచ్చి | 22 | 8 | 11 | 0 | 3 |
| కోవూరు | 22 | 16 | 5 | 0 | 1 |
| **సూళ్లూరుపేట** | | | | | |
| తడ | 13 | 6 | 6 | 0 | 1 |
| సూళ్లూరుపేట | 9 | 3 | 6 | 0 | 0 |
| నాయుడుపేట | 10 | 10 | 0 | 0 | 0 |
| ఓజిలి | 10 | 5 | 4 | 1 | 0 |
| దొరవారిసత్రం | 10 | 2 | 6 | 1 | 1 |
| పెళ్లకూరు | 10 | 0 | 10 | 0 | 0 |
| నెల్లూరు గ్రామీణం | 11 | 4 | 6 | 0 | 1 |

## 'పది'తో ప్రథమ స్థానంలో నిలిచిన 'రత్నం'లు



నెల్లూరు దర్గామిట్ట లోని డా॥ కిషోర్స్‌రత్నం స్కూల్స్ విద్యాసంస్థలు ఈ నెల 15న ప్రకటించిన పదోతరగతి ఫలితాల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లతో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 10కి 10, 9.8, 9.7, 9.5 గ్రేడ్‌లతో అత్యధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కొద్దిశాతం 9కిపైగా గ్రేడ్ పాయింట్లతో విజయం సాధించారు. రత్నం ఫ్యూచర్ విజన్ స్కూలు విద్యార్థులు షేక్ షస్మితమోహిసిన్, జి.విజయసాత్విక్‌రెడ్డి, తన్విశ్రీ, నిత్య, రత్నం జే.ఓ. బ్యాచ్ విద్యార్థి రణదేవ్‌వర్మ, రత్నం మోడల్ స్కూలు విద్యార్థిని అజితారెడ్డి 10కి 10 పాయింట్లు సాధించారు. ఈ సందర్భంగా సరస్వతినగర్‌లో డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూలులో జరిగిన సభలో పాఠశాల జియం రామ్మూర్తి నాయుడు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 383మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 5మంది 10పాయింట్లు, 38మంది 9.8, 85మంది 9.7, 128మంది 9.5, 163 మంది 9.3, 195మంది 9.2, 213మంది 9పాయింట్లు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతిలు విద్యార్థులకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

## 'పది'లో శ్రీనేతాజీ హ్యాట్రిక్



నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలో వున్న శ్రీ నేతాజీ(ఎమ్మెస్సార్) హైస్కూలు విద్యార్థులు ఈ నెల 15న విడుదలైన పదో తరగతి ఫలితాల్లో విజయఢంకా మోగించారు. ఆర్.మహిధర్, కె.నిఖిలలు 10కి 10పాయింట్లు సాధించగా 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణతతో వివిధ ఉత్తమ పాయింట్లతో ప్రతిభ చాటారు.

విశేషమేమిటంటే ఈ పాఠశాల విద్యార్థులు 2012, 2013, 2014 సంవత్సరాలలో పదోతరగతి ఫలితాల్లో 10కి 10పాయింట్లతో హ్యాట్రిక్ సాధించడమే. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ నేతాజీ సుబ్బారెడ్డి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

### పదో తరగతి ఫలితాల్లో

## సత్తా చాటిన మైథిలి





నెల్లూరు వేదాయపాళెంలోని మైథిలి స్కూలు విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో 10కి 10పాయింట్లు సాధించి రికార్డు నెలకొల్పారు. బి.రాహుల్‌కుమార్, జి.శుభశ్రీ 10కి 10పాయింట్లు సాధించగా 6మంది విద్యార్థులు 9.7 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు. నూరుశాతం ఉత్తీర్ణతతో తమ విద్యార్థులు సత్తా చాటడమేకాకుండా పరీక్షల్లో పాల్గొన్న 47మంది విద్యార్థుల్లో 40మంది 8 నుంచి 10పాయింట్లు సాధించడం తమకు ఎంతో సంతోషాన్ని, ఉత్సాహాన్ని కలిగించిందని స్కూలు కరస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘనతను పాఠశాలకు సాధించి పెట్టిన విద్యార్థులు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శుభాభినందనలు తెలిపారు.

# మొత్తం బాధ్యత నాదే!



నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి తానే పూర్తి బాధ్యత వహిస్తానని నెల్లూరు గ్రామీణ మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి చెప్పుకొచ్చారు. ఈ నెల 13వతేదీన నెల్లూరులోని నగర కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఓడిపోతుందని తెలిసినా తనమీద గౌరవంతో అభిమానంతో ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ జీవితాంతం ఋణపడి వుంటానన్నారు. తాము చేసిన అభివృద్ధిని చూసైనా ప్రజలు గెలిపిస్తారనే నమ్మకంతో కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టామని, తమ అభివృద్ధి ప్రజల కళ్లముందు కనపడుతున్నప్పటికీ శబ్ద కాలుష్యంతో మా విన్నపాలు మాత్రం వారికి వినిపించలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు తాము చేసిన అభివృద్ధిని చూసి తమను మన్నించాలన్నారు. నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మోసం చేసి వెళ్లిన వారు అనేకమంది ఉన్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలలోనూ కాంగ్రెస్‌కు మూడోస్థానమే దక్కుతుందని ఆయన చెప్పుకొచ్చారు.

సింహపురి సమాచారం

# బంగారు ఓటర్లు



ఈ ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఓటర్లకు బంగారు బహుమతులను ప్రకటించడం జరిగింది. జిల్లాలో 41మంది ఓటర్లను ఎంపికచేసి ఒకరికి 100గ్రాముల బంగారం, నలుగురికి పదేసి గ్రాముల బంగారం, 36మందికి రెండేసి గ్రాముల చొప్పున బంగారాన్ని బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు. దీని ప్రకారం ఓటు హక్కు వినియోగించుకున్న వారి జాబితా నుండి ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా 41మందిని ఎంపిక చేసారు. వీరిలో కావలి మండలం చెంచుగానిపాలెంకు చెందిన కె.మాలకొండయ్య 100గ్రాముల బంగారాన్ని గెలుచుకున్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రేఖారాణి చేతులమీదుగా మాలకొండయ్య 100గ్రాముల బంగారం బహుమతినందుకున్నారు. అలాగే ఇంకొంతమంది విజేతలకు కూడా ఆమె బంగారు బహుమతులందజేసారు.

## గుంటూరుజోన్ ఇన్‌ఛార్జ్‌గా
# నెల్లూరు-2 సబ్‌రిజిస్ట్రార్

రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపి సబ్‌రిజిస్ట్రార్ల సంఘం అడ్‌హాక్ కమిటీని ఎంపిక చేసింది. కమిటీలో గుంటూరుజోన్ ఇన్‌ఛార్జ్‌లుగా నెల్లూరు-2 జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ వై.కె.నందకిషోర్ ఎంపికయ్యారు. విభజనకు ముందు ఆయన ఆంధ్ర రాష్ట్ర సబ్‌రిజిస్ట్రార్ల సంఘంకు గుంటూరు జోన్ అధ్యక్షుడుగా పనిచేసారు.

# గూడూరులో 'ఇస్కాన్' జగన్నాథ రథయాత్ర

త్వరలో గూడూరులో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ టెంపుల్ ప్రధాన బాధ్యులు సుఖదేవస్వామి తెలిపారు. గత సంవత్సరం మొదలు పెట్టామని, ఇది ద్వితీయ సంవత్సరమవుతుందని భక్తులందరూ వేలాదిగా ఈ రథయాత్రలో పాల్గొని హరేకృష్ణ నామస్మరణతో ఆడుతూ పాడుతూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందమని పేర్కొన్నారు. రథయాత్రలో పాల్గొనే వారందరికీ వసతి సౌకర్యాలు కల్పించామని, ప్రసాద పంపిణీ జరుగుతుందని తెలిపారు.

# అజీజ్‌కు ఆర్ఎస్ఆర్ అభినందనలు



వైఎస్సార్సీపీ నెల్లూరు నగర మేయర్ అభ్యర్థి అజీజ్‌ను ఈనెల 13న 18, 21డివిజన్లలోని కార్యకర్తలు ఆర్ఎస్ఆర్ అభిమానులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఆత్మీయంగా సన్మానించారు. వారంతా బైక్ ర్యాలీ నిర్వహించి అజీజ్ కార్యాలయంలో అజీజ్ సోదరుడు జలీల్‌కు అభినందనలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఆర్ అనుచరులు పాపిరెడ్డి, భరత్, సురేష్, అంజిరెడ్డి, ఇన్నరెడ్డి, లూతురెడ్డి, కిషోర్, వెంకటస్వామి, శివ, జయ, హరి, సూరి, ప్రకాష్, మనోజ్, నాని, నాగేశ్వరరావు, నాదముని, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో ఓటమి...
# స్వయంకృతాపరాధమే!



కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లు నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలలో తెలుగుదేశం పరాజయానికి అనేక కారణాలున్నాయి. ఇక్కడ వైకాపా గెలిచిందనే దానికంటే తెలుగుదేశంపార్టీ తనను తాను ఓడించుకుందని చెప్పడం సబబుగా ఉంటుంది. అభ్యర్థుల ఎంపిక దగ్గర నుండి పొత్తులు కుదరకపోవడం, ఒకర్నొకరు ఓడించుకోవాలనుకోవడం, నెల్లూరురూరల్ నియోజకవర్గంలో పార్టీకి సరైన నాయకత్వం లేకపోవడం, నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం వంటివన్నీ కూడా వైసిపికి అత్యధిక డివిజన్‌లు వచ్చేందుకు దారితీసిన కారణాలు.

తెలుగుదేశం ఓటమికి ప్రధాన కారణం నెల్లూరురూరల్ నియోజకవర్గంలో సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం. కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ లోటు కొట్టొచ్చినట్లు కనిపించింది. రూరల్ నియోజకవర్గంలో టిక్కెట్ల పంపిణీ కూడా గందరగోళంగా జరిగింది. నాయకులు వాటాలేసుకుని తలా నాలుగు డివిజన్‌ల లెక్కన పంచుకున్నారేగాని, ఏ డివిజన్‌లో ఎవరైతే గెలుస్తారనే లెక్కలు వేసి టిక్కెట్లు ఇవ్వలేదు. దీనివల్ల టీడీపీ రూరల్‌లో దారుణంగా దెబ్బతింది. పలు డివిజన్‌లలో టీడీపీ రెబల్స్ కూడా తెలుగుదేశం అభ్యర్థుల విజయావకాశాలను దెబ్బతీసారు. నెల్లూరు నగరంలో రెండువర్గాల మధ్య కుమ్ములాటలు కూడా పార్టీకి నష్టాన్ని మిగిల్చాయి. వర్గాలవారీగా సీట్లు తీసుకోవడంతో గెలవాల్సిన కొన్ని డివిజన్‌లలో తెలుగుదేశం ఓడిపోయింది.

ఇక ఎన్నికలకు ముందు బీజేపీతో పొత్తు పెట్టుకోవాలనుకున్నారు. కాని ఆ పార్టీతో పొత్తు కుదరకుండా కొందరు తెలుగుదేశం నాయకులే చెడగొట్టారు. బీజేపీతో పొత్తు కుదిరివుంటే బీజేపీ ఖాతాలో ఖచ్చితంగా మరో రెండుసీట్లు చేరేవి. అతి తక్కువ మెజార్టీతో ఓడిపోయిన కనీసం నాలుగైదు డివిజన్‌లలో తెలుగుదేశం గెలిచి వుండేది.

తెలుగు దేశం నాయకులు కార్పొరేషన్‌ను ఎలాగైనా దక్కించుకోవాలని ప్రణాళికాబద్ధంగా పనిచేసివుంటే ఖచ్చితంగా తెలుగుదేశంకు ఇంకో నాలుగైదు డివిజన్‌లు పెరిగేవి. తెలుగుదేశం ఓటమి ఖచ్చితంగా స్వయంకృతాపరాధమే.

# అంతా కొత్తవారే... కనిపించని పాతనీరు

నెల్లూరు నగరపాలకసంస్థ ఎన్నికల్లో కార్పొరేటర్లుగా ఎన్నికైన వారిలో అధిక శాతం మంది కొత్తవాళ్లే. పాతవాళ్లలో కిన్నెరప్రసాద్, నూనె మల్లిఖార్జునయాదవ్, పోలుబోయిన రూప్‌కుమార్‌లు మాత్రమే ఉన్నారు. మిగతా 51మంది కూడా కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్‌లోకి కొత్తగా అడుగుపెడుతున్నవాళ్లే! ఇక సీనియర్లలో మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు(సీపీఎం), పిండి సురేష్(కాంగ్రెస్), అబ్దుల్ మునాఫ్ (కాంగ్రెస్), స్వర్ణ వెంకయ్య(టీడీపీ)లు ఈ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. అలాగే ధారా జయరాజ్, మండ్ల ఈశ్వరయ్య, సంక్రాంతి కల్యాణ్‌లు తమ కుటుంబసభ్యులను నిలబెట్టినా గెలిపించుకోలేకపోయారు.

# లక్కీ విజేతలు..

నెల్లూరు నగరపాలకసంస్థ ఎన్నికలలో చాలా తక్కువ ఓట్ల తేడాతోనే చాలా డివిజన్‌లలో ఫలితాలు తారుమారయ్యాయి. 39వ డివిజన్‌లో వైసిపి అభ్యర్థి కాకుటూరు లక్ష్మీసునంద కేవలం 6ఓట్ల తేడాతో గెలిచారు. ఈ డివిజన్‌లో చివరివరకు తెలుగుదేశంకు మెజార్టీ రాగా తుది రౌండ్‌లో వచ్చిన మంచి మెజార్టీతో వైకాపా 6ఓట్లతో గెలిచింది. అలాగే 33వ డివిజన్‌లో షేక్‌తాజున్నీ కేవలం 16ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ డివిజన్‌లో కూడా మొదట బీజేపీ ఆధిక్యంలో వుండింది. కాని చివరికి వచ్చేసరికి వైసిపి గెలిచింది. టీడీపీ ఓట్లను చీల్చబట్టే ఇక్కడ వైసిపి గెలిచింది. ఇలా కొంతమంది వెంట్రుకవాసిలో విజయాలను కోల్పోయారు.


కన్నీటి నివాళి



మంచితనానికి నిలువెత్తు రూపం
ఎందరి గుండెల్లోనో ఆశాదీపం
మనసున్న మారాజు
మా పెద్దాయన
శ్రీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గారి
మాజీముఖ్యమంత్రివర్యులు, రాజ్యసభసభ్యులు
ఆకస్మిక మరణానికి చింతిస్తూ...
వారి ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

అశ్రునయనాలతో...

పందిళ్లపల్లి అరుణమ్మ
జిల్లా మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు

పందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డి
పందిళ్లపల్లి హేమంత్‌కుమార్‌రెడ్డి

శ్రీను గల్పిక

# స్వర్గంలో పెద్దారెడ్డి హాల్‌చల్

అంకితం – ఒకే సిద్ధాంతంతో నడయాడి, ఒకే పార్టీకి కట్టుబడి, రాజకీయ నాయకుడంటే తనలా ఉండాలని నిరూపించుకున్న రాజకీయ యోధుడు నెల్లూరు పెద్దాయన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గారికి కన్నీటి నివాళులతో...



నెల్లూరు పెద్దారెడ్డి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అప్పుడే కళ్లు తెరిచాడు. తాను పడుకున్న మంచం, ఎదురుగా ఉన్న వాతావరణం చూసి ఆయన ఆశ్చర్య పోయాడు. హైదరాబాద్‌లోని తన 'జనప్రియ' నివాసం బెడ్‌రూంలో నిద్రపోవడం గుర్తుంది. కాని అది తన బెడ్‌రూం కాదని ఆయన గ్రహించారు. తననెవరో కిడ్నాప్ చేసి ఎక్కడన్నా బంధించారా అనే అనుమానం కూడా కలిగింది. రాజాల కోట లాంటి భవనంలో ఆయనున్నారు. అక్కడ వాతావరణం ఆయనకు కొత్తగా అనిపించింది. వెంటనే 'రేయ్' బాలసుధాకర్ అంటూ కేకపెట్టాడు. బాలసుధాకర్ రాలేదు. రేయ్ మున్నా అని మళ్లీ అరిచాడు. మున్నా కూడా రాలేదు. ఆ పిలుపుకు సూటూబూటు వేసుకుని చేతిలో ఏ.కె.47 తుపాకీతో ఓ వ్యక్తి మాత్రం వచ్చాడు. నేదురుమల్లి అతనిని చూసి... నువ్వు నా గన్‌మెన్‌గా ఎప్పుడు అపాయింట్‌మెంట్ అయ్యావు... నేను నిన్నెప్పుడూ చూడలేదే... అని అడిగాడు. దానికతను... నేను నీ గన్‌మెన్‌ను కాదు, యమకింకర్‌ను. ఇది యమలోకం. నిన్న రాత్రే నిన్ను భూలోకం నుండి యమలోకం తీసుకొచ్చాం... అని చెప్పాడు. ఆ మాటకు నేదురుమల్లికి ఒళ్లు మండింది. నా పర్మిషన్ లేకుండా నా విషయంలో కాంగ్రెస్ అధిష్టానమే ఏ పనీ చేయదు. అలాంటిది నాకు చెప్పకుండా ఇక్కడకు తీసుకురావడానికి మీరెవరూ... అసలు మీ ప్రెసిడెంట్ యమ ధర్మరాజు ఎక్కడున్నాడని గద్దించాడు. రండి తీసుకుపోతానంటూ అతను నేదురుమల్లిని తన వెంట ఓ హాల్‌లోకి తీసుకెళ్లాడు. అదో పెద్ద కార్పొరేట్ కంపెనీ మాదిరిగా వుంది. ఎక్కడచూసినా కళ్లు చెదిరే ఫర్నీచర్, ఎల్‌సిడిలు, వివిధ ఆకర్షణీయమైన ఇంటర్నే షనల్ మోడల్స్ చిత్రపటాలు అమర్చి ఉన్నాయి. నేదురుమల్లి వాటివైపు హుషారుగా చూస్తూపో తుంటే... ఓ గదిలో నుండి కొందరు భయంతో కేకలు వేయడం చూసాడు. నేదురుమల్లి వుండి... ఎందుకు వాళ్లు అలా కేకలు పెడుతున్నారని అడిగాడు. దానికతను... వాళ్లంతా పాపులు... భూలోకంలో వారు చేసిన పాపాలకు శిక్షలు అనుభవిస్తున్నారని చెప్పాడు. శిక్షలంటే గోళ్లల్లో ముల్లులు గుచ్చడం, నిప్పుల్లో నడిపించడం, సలసల కాగే నూనెలో ముంచడం... ఇవేగా అని నేదురుమల్లి అన్నాడు. దానికి అతను... మీరు యమలోకం గురించి ఇంకా పాత తరహాలోనే ఆలోచిస్తున్నారు. ఆ శిక్షలు మా పెద్దోళ్ల కాలంలో వుండేవి. ఇప్పుడు మీ భూలోకంలో కంటే మా యమలోకంలోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువుగా వాడుతున్నాం. పాపులకు అలాంటి సాధారణ శిక్షలు వేయం... భూలోకం నుండి అన్ని టీవీ ఛానెల్స్‌లో వచ్చే వివిధ తెలుగు సీరియల్స్ సి.డిలను తెప్పిస్తాం... పాపులకు వాటినే మార్చి మార్చి చూపిస్తుంటాం... అవి చూడ లేక వాళ్లు... ఇంకో జన్మంటూ వుంటే ఇంకే పాపం చేయకూడదనుకునే మానసిక పరివర్తన తెచ్చుకుంటా రని చెప్పాడు. అందుకు నేదురుమల్లి... వీళ్లంటే పాపాలు చేసి సీరియళ్లు చూస్తున్నారు. మరి మా భూలోకంలో ఆడోళ్లు ఏం పాపం చేసారు. వాళ్లు రోజూ సీరియల్స్ చూస్తూ ఏడుస్తున్నారే అని అడిగాడు. వాళ్లు చేసిన పాపాలకు భూలోకంలోనే శిక్ష అనుభవి స్తున్నారు కాబట్టి యమలోకంలో వారికి ఆ శిక్షల నుండి మినహాయింపు వుంటుందని చెప్పాడు. వారు అలా నడుచుకుంటుండగానే యమధర్మరాజు ఛాంబర్ వచ్చింది. అక్కడున్న రిసెప్షనిస్ట్ లోపలకు కాల్ చేసి... మీతో మాట్లాడుటకు భూలోకం నుండి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనే పాపి వచ్చారు అని చెప్పింది. వీళ్లు పరిసరాలను మార్చుకున్నారు గాని మాటతీరు మార్చుకోలేదని నేదురుమల్లి మనసులో అనుకున్నాడు. లోపలకు రమ్మని పర్మిషన్ రాగానే నేదురుమల్లి ఆయన ఛాంబర్‌లోకి అడుగు పెట్టాడు. యమధర్మరాజు ఆయనను ఆహ్వానించి తన ముందున్న కుర్చీలో కూర్చోమన్నాడు. నా పర్మిషన్ లేకుండా నన్నెందుకు ఇక్కడకు తీసుకొచ్చారని నేదురు మల్లి అడిగాడు. యమధర్మరాజు వుండి... నిన్నటితో మీకు భూలోక వీసా గడువు తీరినట్లు మా కంప్యూ టర్‌లో వచ్చింది. అందుకే యమలోకం పాస్‌పోర్ట్ జారీ చేసాం. ఇక్కడ రెండురోజులు మీరుండాలి. ఎంతైనా మీరు రాజకీయాల్లో ఉన్నారు కదా, కొంతైనా పాపం చేసి వుంటారు. మీకు ఒకట్రెండు సీరియల్స్ చూపించేసి స్వర్గలోకానికి పంపిస్తామన్నాడు. సీరియల్స్ చూపిస్తామనే సరికి నేదురుమల్లికి అంతకుముందు చూసిన పాపుల కేకలు గుర్తుకొచ్చాయి. ఆ శిక్ష నుండి ఎలాగైనా తప్పించుకోవాలనుకున్నాడు. వెంటనే యముడితో... మీరెంతకాలం నుండి ఈ పదవిలో వున్నారని అడిగాడు. దానికి యముడు... యుగ యుగాల నుండి నేనే ఈ పదవిలో ఉన్నానన్నాడు. అప్పుడు నేదురుమల్లి... మా సోనియాగాంధీ కూడా ఇన్నేళ్లు ఏఐసిసి అధ్యక్షపదవిలో లేదు... ఇది అన్యాయం, మీరు వెంటనే రాజీనామాచేసి మీ క్రింద పనిచేసే వారికి ఈ సింహాసనాన్ని అప్పగించండి అని గట్టిగా మాట్లాడారు. నేదురుమల్లి మాటలకు అక్కడ ఉండే నౌకర్లు కూడా వంతపాడారు. ఈ పెద్దాయన తన కుర్చీ క్రిందకు నీళ్లు తెచ్చే ప్రమాదముందనుకున్న యముడు వెంటనే ఆయనకు విధించిన శిక్షను రద్దుచేసి స్వర్గలోకానికి పంపమని తన భటులను ఆదేశించాడు.

★★★★★

స్వర్గలోకం ఎంట్రన్స్ గేటు వద్ద దేవలోక పాల కులు నేదురుమల్లిని ఆహ్వానించి దేవేంద్రుడి వద్దకు తీసుకెళ్లారు. దేవేంద్రుడు ఆయనకు స్వాగతం పలికి మీరు ఇక ఈ లోకంలో సుఖంగా ఉండవచ్చున్నాడు. అందుకు నేదురుమల్లి... నేనూ అదే అనుకుంటున్నాను. 'యమగోల', 'యముడికి మొగుడు', 'యమలీల' వంటి సినిమాలు నేను చూసాను. ఆ సినిమాల్లో ఉన్నట్లు ఊర్వశీ, మేనక, రంభ కనిపించరేమని అడిగాడు. అప్పుడు దేవేంద్రుడు... ఈయనను మన నర్తనమంది రానికి తీసుకుపొమ్మని దేవలోకపాలకులను ఆదేశిం చాడు. వాళ్లు నేదురుమల్లిని ఓ మందిరంలోకి తీసు కెళ్లారు. అక్కడ 70ఏళ్ల వయసున్న ముగ్గురు ముసలి మహిళలు ఉన్నారు. వారి తలంతా నెరిసిపోయి చర్మం ముడతలుపడి వుంది. ఆ ముసలోళ్లు ఎవరని నేదురు మల్లి అడిగాడు. దేవలోకపాలకులు... వారే మీరు అడిగిన రంభ, ఊర్వశి, మేనకలని చెప్పాడు. ఆ మాటకు నేదురుమల్లి బిత్తరపోయాడు. నేను యమగోల సినిమాలో చూసిన రంభ, ఊర్వశి, మేనకలు చాలా యంగ్ అని అన్నాడు. అప్పుడు వీళ్లు యంగే... యమగోల సినిమా తీసి 40ఏళ్లయ్యింది కదా... వీళ్లు ముసలోళ్లయిపోయారు అని దేవలోక పాలకులు చెప్పారు. అంతలో 'రారా సరసకు రారా" అనే చంద్రముఖి సినిమాలో పాట రాగా రంభ, ఊర్వశి, మేనకలు డ్యాన్స్ చేస్తూ నేదురుమల్లి వైపుకు రాసాగారు. వారిని చూసి నేదురుమల్లి అదిరిపడి పరిగెత్తుతూ దేవేంద్రుడి వద్దకు వచ్చాడు. నాకు రంభ, ఊర్వశి, మేనకల డ్యాన్స్ వద్దు గాని, నన్ను భూలోకం పంపించండి... అక్కడ మా రాహుల్ ప్రధాని కాబోతున్నాడు. మా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాబోతుంది. ఆ సుందర దృశ్యాలను చూసి నేను మళ్లీ రెండురోజుల్లో వస్తాన న్నాడు. అప్పుడు దేవేంద్రుడు... పిచ్చి పెద్దారెడ్డి... అక్కడ నువ్వు కొన్ని ఘోరమైన దృశ్యాలు చూస్తే తట్టుకోలేవనే ఉద్దేశ్యంతోనే నిన్ను తొందరగా ఇక్కడకు తెచ్చాము. నువ్వు బెడ్‌మీద ఉండగానే, నీకు తెలియకుండానే రాష్ట్రాన్ని మీ సోనియాగాంధీయే రెండుగా చీలగొట్టింది. నువ్వు పునాది వేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పునాదులతో సహ కూలిపోయింది. ఇక రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఒక కలగా మిగిలింది. దేశంలోనే కాంగ్రెస్ కుప్పకూ లింది. భూలోకంలో వుండి ఈ ఘోరదృశ్యాలు చూడాల్సిన బాధను మీకు తప్పించాము... మీ పెద్దమనసుకు బాధ కలిగించకూడదనే ఇలా చేసాం అని చెప్పాడు. జరిగిన పరిణామాలను తెలుసుకుని నేదురుమల్లి బాధపడుతూ... తన గురించి ఆలో చించి తొందరగా స్వర్గానికి తీసుకొచ్చిన దేవేంద్రుడికి థ్యాంక్స్ చెప్పాడు.

కదంబం

## భూజాత

కందిపాటి గోపాలరావు,
నెల్లూరు. 9652174640.

ఒంటి కాలిపై నిలబడ్డ మునిలా
రేయింబవళ్లూ
అడుగుజాగాలో అలానే...
ఎప్పుడూ, ఎవర్నీ, ఏదీ
చేయి సాచి అడగటం చూళ్లేదు.
పచ్చదనమే
అభిమాన ధనమన్నట్టు

ఎత్తినకత్తికీ,
జడిసి నమస్కరించటం చూళ్ళేదు
చిటారుకొమ్మ శిరసెత్తి చూట్టం
తప్ప
ప్రతి ఆకులీ
ఆత్మగౌరవ ప్రతీకైనట్టు

అందుకే
ఎదగటానికి
ఎవరి చుట్టూ తిరగని
చెట్టుకు నమస్కరిస్తుంటాను
మూఢనమ్మకమని అనుకున్నా
మూడుసార్లు
ప్రదక్షణ చేసిమరీ...

## మాతృదేవోభవ



అమ్మను గౌరవించే సత్సంప్రదాయాల ఘని భారతావని వరుసతప్పిన నవనాగరికతతో బిడ్డల నిరాదరణకు గురవుతున్న అమ్మలను సమాదరించా లన్న సందేశాన్ని పాశ్చాత్య దేశాలకు తెలియజేసేలా మాతృదినోత్సవాన్ని ఈనెల 12న నెల్లూరులోని సాహితీ మిత్ర మండలి ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా గాంధీబొమ్మ వద్దనున్న సాయి బాబా గుడి దగ్గర యాచన చేస్తూ జీవిస్తున్న ఓ మాతృమూర్తిని సముచిత రీతిలో గౌరవించింది సాహితీ మిత్రమండలి సభ్యులైన కవి ఏటూరి నాగేంద్రరావు మాట్లాడుతూ అమ్మంటే మమతల రెమ్మల కొమ్మని, అటువంటి కొమ్మని వృద్ధాప్యంలో కంటికిరెప్పలా కాపాడాలని పేర్కొన్నారు.

కీర్తి పురస్కార గ్రహీత చిన్ని నారాయణరావు మాట్లాడుతూ అమ్మంటే భువిలో వెలసిన అమృతమూర్తి అని, ఆమెను ఎంత ఉన్నతంగా సత్కరించినా, గౌరవించినా రుణం తీర్చుకోలేమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈదూరు సుధాకర్ తదితర సాహితీమిత్రులు పాల్గొన్నారు.

శోభాయమానంగా...

## శ్రీ రంగనాథుని గరుడసేవ

నరసింహస్వామి జయంతి సందర్భంగా ఈనెల 13న నెల్లూరు రంగ నాయకులపేటలోని శ్రీ రంగనాథునికి బంగారు గరుడసేవ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, నిషింద సుదర్శనాచార్యులు తల్పగిరి రంగనాథస్వామికి మంగళస్నానాలు చేయించి రకరకాల పుష్పాలు, పట్టు పీతాంబరాలతో బంగారు గరుడ వాహనంపై అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బంగారు గరుడ వాహనంపై నిలిచిన స్వామిని రంగనాయకులపేట నుంచి లక్ష్మీపురం వరకు ఊరేగించి భక్తులకు దీవెనలందించారు. కార్యక్రమాలను ఆలయ ఇఓ పి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

## వైభవంగా పెనుశిల నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందే పెంచలకోనలో వెలసిన నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలని తలపిస్తూ కోన భక్తులతో కిటకిటలాడుతూ కళకళలాడుతోంది. రాష్ట్రం నలుదిక్కుల నుంచి తరలివచ్చిన భక్తులు బంగారు గరుడ వాహనంపై విశేష రీతిలో అలంకరించబడిన పెనుశిల నృసింహుని రాత్రి 11గంటలకు దర్శించి తరించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి నిర్వహించిన ఊంజల్ సేవలో శ్రీవారు తిరుచి వాహనంపై కొలువుదీరి సహస్ర దీపారాధన మండపంలోకి చేరగా దేవేరులను ఉయ్యాలపై వేంచేపు చేసారు. బుధవారం ఉదయం 6గంటలకు నృసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారు, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూలంగిసేవ తదుపరి 10గంటలకు శ్రీవారి తిరుకల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు రథోత్సవం, రాత్రి 10గంటలకు గజవాహనసేవ, 12గంటలకు ఏకాంతసేవలు భక్తిపూర్వకంగా జరిపారు. కార్యక్రమాల్లో బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి రవీంద్రరెడ్డి, ఆలయ సహాయ కమీషనర్ శ్రీ రామమూర్తి, ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆరోగ్యం, ఆహార విషయాలలో జాగ్రత్త వహించండి. మీ కుటుంబసభ్యుల మద్దత్తు మీకు పూర్తిగా ఉంటుంది. స్త్రీలకు కొద్ది అనారోగ్య బాధలుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు చికాకులుండినా అధిగమిస్తారు. క్రొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడులకు తొందరపడవద్దు. ఆదాయం ఆశించినంతగా ఉండదు. వ్యవహారాలు, పనులు అనుకున్న విధంగా సాగవు. అందుకని టెన్షన్‌పడుతుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కోర్టు వ్యవహారాలుపడటం వాయిదాపడటం, రావలసిన వసూళ్ళ ఆలస్యంకావడం జరుగుతుంది. ముఖ్య బంధువర్గంలో నుండి అనారోగ్య వార్తలువింటారు. ఆశించిన విధంగా ఆర్థిక పరిస్థితులుండ గలవు. వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. ఆర్థిక ఇబ్బందులను అధిగమించే ప్రయత్నాలుంటాయి. ఋణాలు చేయవలసి వస్తుంది. పనులు అనుకున్నంత వేగంగా జరగవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి. క్రయ విక్రయాలలో తొందరపడవద్దు. అనుకున్న పనులు పట్టుదలతో సాధిస్తారు. కొన్ని ముఖ్య పనులు, కార్యక్రమాలు వాయిదా పడవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వాణిజ్య అవకాశాలు, ఆర్థికపరమైన సహకారం పొందుతారు. ప్రభుత్వ సౌఖ్యం బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి. యజమానులకు వర్కర్లతోను, అధికారులు తమ క్రింది ఉద్యోగులతో సమస్యలు ఎదుర్కొంటారు. వ్యాపార చిక్కులను ఇబ్బందులను అధిగమిస్తారు. క్రొత్త పెట్టుబడులు, క్రొత్త వ్యాపారాలు ప్రస్తుతం ఆపుకొనడం మంచిది. ఆదాయం సంతృప్తికరంగా ఉండినా ఖర్చుల వత్తిడి పెరుగుతుంది. బంధుముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 16.05.2014 నుండి
తేది. 22.05.2014 వరకు

**పంచాంగము:**

**ముహుర్తము:** ముహూర్తములు లేవు.

తేది 23 శుక్రవారము హనుమజ్జయంతి

**వైశాఖ బహుళ పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | శుక్ర | దశమి | రా॥గం.9.52వ॥ |
| తేది. 17 | శని | ఏకాదశి | రా॥గం.7.53వ॥ |
| తేది. 18 | ఆది | ద్వాదశి | సా॥గం.5.45వ॥ |
| తేది. 19 | సోమ | త్రయోదశి | సా॥గం.3.24వ॥ |
| తేది. 20 | మంగళ | చతుర్దశి | ప॥గం.12.58వ॥ |
| తేది. 21 | బుధ | పూర్ణిమ | ప॥గం.10.26వ॥ |
| తేది. 22 | గురు | అష్టమి | ఉ॥గం.8.08వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బిడ్డలకు విద్యా ఉద్యోగ అవకాశాలు లభించగలవు. శుభకార్యాలలో పాల్గొంటారు. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. అనుకున్న పనులు సవ్యంగా జరిగిపోతాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికావకాశాలు బాగుండి ఆదాయము పెరుగుతుంది. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగగలవు. కొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడులు జరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత, స్థిరాస్తులు లావాదేవీలందు నిర్ణయాలు జరుగుతాయి. శుభకార్యాలలో పాల్గొనడం, విలువైన వస్తువులు వస్త్రాభరణాలు చేకూర్చుకొనడం జరుగుతుంది. ఆర్థిక విషయాలలో అంచనాలు ఫలించగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభకార్యాలలో పాల్గొంటారు. గృహనిర్మాణాలు రిపేర్లు చేపట్టవచ్చును. స్థిరాస్తులపై ఆదాయముంటుంది. వ్యాపార అభివృద్ధి పథకాలు ప్రయత్నాలు జరుగుతాయి. వృత్తిపరంగా బాగా వ్యాపకం ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. వ్యవహారాలలో ఓర్పు ముందు చూపు ప్రదర్శించండి. నూతన కోర్టు వాయిదాలు చికాకు కలిగిస్తాయి. మీ ఆరోగ్యం బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపార భాగస్వామ్య అవకాశాలు, కొత్త పెట్టుబడి అవకాశాలు దొరుకుతాయి. విలువైన వస్తువులు, గృహోపకరణాలు కొంటారు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. ఏదో ఒక రూపంలో ఖర్చులు పెరిగినా ఆర్థికంగా ఇబ్బంది ఉండదు. సోదర వర్గానికి మంచి జరుగుతుంది. ఇచ్చిన మాట, చేస్తానన్న సహాయం నిలబెట్టుకుంటారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపార ఆదాయం పెరుగుతుంది. కరెంటు పనులు, మెషిన్లు పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. సమావేశాలలో కమిటీ మీటింగులలో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. అధికారుల వద్దగాని పబ్లిక్‌లోగాని మాటలుపడకుండా అవమానం పొందకుండా జాగ్రత్తపడాలి. వృత్తి జీవనం కలవారికి వృత్తి వ్యాపకం బాగుండి ఆదాయము పెరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చర్యలు సంప్రదింపులలో పాల్గొంటారు. అదనంగా ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. ఆర్థిక లావాదేవీలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. దూరం నుండి ఆహ్వానాలు అందుకొనడం, దూరప్రయాణాలు జరపడం జరుగుతుంది. శుభకార్యాలలో ముందుండి నిర్వహిస్తారు. వ్యాపారవర్గాల ఇతరుల నుండి పోటీ ఎక్కువగా ఉంటుంది. అయినా ధైర్యంతో ముందుకు సాగుతారు. శుభకార్య ప్రయత్నాలు నిర్ణయంకాగలవు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఇతరుల వల్ల మాటలు పడవలసి వచ్చును. రావలసిన బాకీలు వాయిదాపడతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులు వల్ల సమస్యలోపడతారు. అదుపులేని ఖర్చులు తప్పవు. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. ఇబ్బందుల నుండి గట్టెక్కడానికి మార్గాలు తోచవు. కుటుంబంలో కొద్దిపాటి విభేదాలుంటాయి. యజమానులకు వర్కర్ల వల్ల ఇబ్బందులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

రావలసిన బాకీలు కొంత వసూలుకాగలవు. వృత్తి ఉపాధి రంగాల జీవనము కలవారికి ఆదాయం బాగుంటుంది. మరియు ఆ రంగంలో నిలద్రొక్కుకుంటారు. వ్యాపారవర్గాలకు మంచి అభివృద్ధి అవకాశాలుండినా నిర్ణయాలు తీసుకొనలేరు. కాని ఆదాయం బాగుంటుంది. ఉద్యోగ బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. నిరుద్యోగులకు అవకాశాలురావడం ప్రారంభమవుతుంది.

# ఎండలా?..మంటలా?

## భానుడి భగభగ..జనం విలవిల!



ఎండలు మండిపోతున్నాయని అనడం సర్వసాధారణమైపోయింది కానీ, ఇప్పుడు ఎండలు నిలువెత్తు మంటల్లా వున్నాయి. భానుడి భగభగలతో, సెగలతో జనం విలవిల్లాడిపోతున్నారు. అసలే, ఎన్నికల వేడి ఒక పక్క, సూర్యుడి ప్రతాపం మరో పక్క. రెండు వైపులా సెగలంటుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ మండిపోతోంది. ఇక మధ్యాహ్నమైతే నిప్పుల కుంపటి మీద నడుస్తున్నట్లుంటుంది. ఇక ఇళ్ళలో జనమైతే, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఫ్యాన్లు తిరుగుతున్నా, బొమ్మ ఫ్యాన్ల మాదిరి వుంటున్నాయే తప్ప, గాలి తగిలితే గదా!..ఆ వచ్చే కొద్ది గాలి కూడా..ఏదో అగ్ని పర్వతం మీద నుంచి వస్తున్న గాలిలా భగ్గుమంటోంది. ఆ వేడిని తట్టుకునేందుకు ఎన్ని నీళ్లు తాగుతున్నా, తాగిన నీళ్ళు తాగినట్టు ఆవిరైపోతున్నాయి. అసలే మే నెల ఎండలు.. ఇంకా భగ్గుమంటున్నాయి. గతంలో మేలో 35 డిగ్రీల దాకా ఎండ వస్తుందని జనం భయపడేవారు. ఇప్పుడు 35 డిగ్రీల నుంచి ఎండ ప్రారంభం అవుతోంది. ఏరోజు కారోజు, 36, 37 ఇలా పెరగడమే తప్ప, ఈ మేలో ఏ మాత్రం తగ్గేట్లు కనిపించడం లేదు. ఈ ఎండల మంటల్లో బతకడం.. ఏరోజుకారోజు ఒక ఛాలెంజ్ కిందే లెక్క. ఈలోగా పొరపాటునో, గ్రహపాటునో కరెంటు పోయిందా!.. ఇక అంతే సంగతులు. ఈ ఎండల్లో మామూలు జనం పరిస్థితే ఇంత అతలాకుతలంగా వుంటే.. ఇక పిల్లలు, వృద్ధుల పరిస్థితి ఆ భగవంతునికే ఎరుక. ఇదిలావుంటే, బస్సుల్లో ప్రయాణించేవారి బాధలు బోలెడు. బస్సు బుర్రున పోతూవుంటే, ఏదో కాస్త ఊపిరాడినట్లు గాలితోలుతుందేమో గానీ, ట్రాఫిక్‌లో కాసేపు ఆగిపోయిందంటే చాలు, ఇక బస్సులో వుండలేక, బయటకు దిగలేక, నానా అవస్తలు తప్పవు. ఇక, బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించే ప్రయాణీకుల అవస్తలు సవా లక్ష. పల్లెల్లో బస్‌షెల్టర్లు నామమాత్రంగానే వుంటాయి. దీంతో, ఏ టీ బంకు వద్దనో, బీడీ బంకు వద్దనో బస్సులు ఆగుతుం టాయి. అయితే, అక్కడికి వెళ్ళి నిలబడాలంటే మహిళలకు రోత పుడుతుంది. కానీ ఏం చేద్దాం? ఊళ్లకెళ్లాంటే బస్సెక్కాల్సిందే. తప్పదు. అందుకే, ఎంత ఇబ్బంది అయినా ఓర్చుకుంటూ ఆ బస్సు వచ్చే దాకా నిలువు కాళ్ళ మీద నిల్చుని ఎండలో మాడాల్సిందే. ఈ నేపథ్యంలో, మహిళలు, బిడ్డలను చంకనేసుకుని వచ్చే తల్లుల పరిస్థితి, ఆ చిన్న బిడ్డల పరిస్థితి మరెంతో దయనీయంగా వుంటుంది. అయినా, ఎవరి బాధలు ఎవరూ పట్టించుకోని మిడిమేళపు కాలం ఇది. ఎండకి గొంతు తడారిపోతున్నా, గుక్కెడు నీళ్లిచ్చే మంచిరోజులు పోయాయి. ఏ ఇంటికో వెళ్ళి కాసిన్ని నీళ్ళివ్వమ్మా తల్లీ..అనడిగితే, ఈ కాలంలో నమ్మే పరిస్థితి లేదు. ఆ వచ్చినవాళ్ళు ఏ దొంగలో.. మాయగాళ్ళో అని భయం. గుక్కెడు నీళ్ళు కూడా కొనుక్కోని తాగాల్సిన దుస్థితి. పాతకాలంలో జనం పంపుల్లో నీళ్ళో, కాలువల్లో నీళ్లో, ఎక్కడ దొరికితే అక్కడ జంకు లేకుండా తాగేసేవాళ్ళు. ఇప్పుడు ఎక్కడ చూసినా కాలుష్యమే. పంపుల్లో కంపు నీళ్ళు, కాలువల్లో డ్రైనేజీనీళ్ళు ఏది తాగినా విరోచనాలు-వాంతులు తప్పవు. నీళ్ళప్యాకెట్ల కాలం వచ్చేసినాక, వాళ్ళు ఏ నీళ్ళు పోసిచ్చినా 'అబ్బ!..ఎంత బావు న్నాయో'! రూపాయిస్తున్నాం కాబట్టి భలే రుచి. అద్దన్న మాట సంగతి. పాతకాలంలో లాగా, పెద్దపెద్ద కుండల్లో చల్లని నీళ్ళు పోసి, వచ్చినవారికి లోటాల కొద్దీ 'తాగండయ్యా..తాగండమ్మా' అంటూ ఉచితంగా మంచి నీళ్ళిచ్చి పుణ్యం కట్టుకునే రోజులు పోయాయి. ఇకపోతే, పట్టణాల్లో దారినపోతూ, ఎండకి డస్సిపోయి ఏ చెట్టుకిందైనా కాసేపు నిలబడదామంటే, చెట్లుంటే కదా..వాటి కింద నీడుండే దానికి? సిమెంట్‌రోడ్ల కోసమనో రోడ్ల వెడల్పు కోసమనో..లేకపోతో దారికి అడ్డం వున్నాయనో ఏదో ఒక వంకతో రోడ్లపక్కల వున్న చెట్లని కొట్టిపారేస్తుంటే. ఇక పాదచారులకు నిలబడేందుకు నీడ కానీ, కూర్చునేందుకు కాస్తంత స్థలం కానీ ఎక్కడుంటుంది? ఈ మండే ఎండల్లో సాదాసీదా జనం ఎక్కడ నిలబడాలి?. సామాన్యుల బాధల గురించి ఆలోచించేదెవరూ? 'అశోకుడు ధర్మచక్రవర్తి.. రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటించెను' అని చిన్నప్పుడు పాఠాల్లో చదువుకుని సంతోషించాం కానీ ఇలా రోడ్డు పక్కల ఏళ్ళతరబడి వున్న చెట్లను కూడా నిమిషాల్లో కొట్టిపారేసే మారాజులుంటారని అనుకున్నామా?..ఏం చేద్దాం? మరో ధర్మచక్రవర్తి ఎవరైనా నెల్లూరుకు వస్తే బావుంటుందనిపిస్తుంది కదూ! అయినా, మనకంత అదృష్టమా?...

# ప్రపంచ నర్సుల దినోత్సవం

ఆసుపత్రిలో నర్సు అంటే సేవకు ప్రతిరూపం రోగులకు దేవతతో సమానం. నిరంతరం అత్యంత సహనంతో రోగులకు సేవచేసే అమృతమూర్తి. వైద్యుల సూచనల మేరకు విధులు నిర్వహిస్తూ రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించి నర్సు అమ్మకు ప్రతిరూపంగా కనిపిస్తుంది. ఈనెల 12న ప్రపంచ నర్సుల దినోత్సవం కావడంతో నెల్లూరులోని ఆసుపత్రులలో నర్సులను సత్కరించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా జరిగిన నర్సుల దినోత్సవంలో 30సంవత్సరాలు సేవలందించిన హెడ్‌నర్సులు కె.దేవమ్మ ఎం.జగదాంబ, 25సంవత్సరాలు పనిచేసిన స్టాఫ్‌నర్సులు సత్యవతి, పద్మమ్మ, వరలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఠాగూర్ మాట్లాడుతూ నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆదర్శమని ఆమెలా ప్రతి ఒక్క నర్సు సేవలందించాలని తెలిపారు. వారి సేవలు రోగులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేది నిరుపేదలేనని, వారికి సేవ చేయాల్సిన బాధ్యత మనందరికీ వుందన్నారు. డాక్టర్లకంటే నర్సులు రోగులను నిరంతరం కనిపెట్టుకొని వుంటారన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్.ఎం.ఓ ఉషాసుందరి, డిసిహెచ్ విజయగౌరి, డాక్టర్ శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

# నేదురుమల్లి మృతి దళితులకు తీరని లోటు

రాష్ట్రంలోని దళిత బహుజనలతో పాటు, అగ్రవర్ణాలలో వున్న నిరుపేదలకు రాజకీయ భిక్షపెట్టి గల్లీ నుంచి ఢిల్లీ వరకు పదవులను పంచిపెట్టిన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మృతి దళిత, బహుజనులకు తీరని లోటులాగా వుందని ఏపి దళిత విద్యార్థి సేన జిల్లా అధ్యక్షులు అరవపూర్ణప్రకాష్ సంతాపం వ్యక్తంచేసారు. నెల్లూరులోని విఆర్‌సి వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని అంబేద్కర్ లైబ్రరీని ఏర్పాటుచేయడమేకాక ఆయన దళిత విద్యార్థులకు, నిరుద్యోగులకు, యువతకు ఎంతో సహాయం చేసారని పేర్కొన్నారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మృతికి పూర్ణప్రకాష్‌తో పాటు, ఏడీవీఎస్, ఏడీఎంఎస్ నేతలు జోగి, శ్రీకాంత్, పచ్చా మధుసూదన్, రవి, జగన్, అల్లాభక్షు, తుమ్మల మేరి, అరవ నిర్మల, టి.లక్ష్మి, వి.లక్ష్మీనారాయణ తదితరులు సంతాపం ప్రకటించారు.

# జననేతకు పట్టాభిషేకం

(మొదటిపేజీ తరువాయి)

ఆ టీవాలా అనే వ్యక్తే ఓ అద్భుతమైన రాజకీయశక్తిగా మారి ఎన్డీఏ కూటమిని 338సీట్ల తిరుగులేని మెజార్టీతో దేశాధికార పీఠంపై నిలబెట్టాడు. ఇక ప్రాంతీయ పార్టీల అవసరం లేకుండా, ఇతర పక్షాలనుప్రాదేయపడే పనిలేకుండా ఎంతో గౌరవ ప్రదంగా ఆయన ఎన్డీఏ కూటమికి బీజేపీ పూర్తి మెజార్టీ 283 సీట్లతో అధికారాన్ని తెచ్చిపెట్టారు.

దేశవ్యాప్తంగా 9విడతలుగా 543 లోక్‌సభ స్థానాలకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి విజయదుందుభి మోగించింది. సర్వేల అంచనాలను మించి ఎన్డీఏ 338 సీట్లను కైవసం చేసుకుంది. ఎన్డీఏకు ఇంత మెజార్టీని రాజకీయ పండితులు కూడా ఊహించలేదు. మెజార్టీ మార్క్ 272సీట్లు దాటుతుందనుకున్నారు. కొందరైతే పూర్తి మెజార్టీకి ఇంకా 20 నుండి 30సీట్లు వెనుకే ఉంటుందని ఊహించారు. జయలలిత, ములాయంసింగ్‌యాదవ్, నితీష్‌కుమార్, మమతా బెనర్జీ... హంగ్ ఫలితాలు వస్తే ఎవరికి వాళ్లు ప్రధాని రేస్‌లో నిలవాలని ముందుగానే కలలు కన్నారు. అయితే భారతీయ ఓటరు వాళ్లకు అలాంటి అవకాశం ఇవ్వలేదు. ఇప్పటికే పలు దఫాలు తృతీయ ఫ్రంట్‌లతో దెబ్బతిన్న ప్రజలు మరోసారి ఆ పొరపాటు చేయలేదు. పదేళ్ల కాంగ్రెస్ పాలనతో విసిగి వేసారిపోయిన భారతీయులు ఈసారి నరేంద్ర మోడీ నాయకత్వ సమర్ధతవైపే మొగ్గు చూపారు. బీజేపీ నాయకులు కూడా ఊహించని మెజార్టీని ఎన్డీఏకు కట్టబెట్టారు.

ఎన్డీఏ ప్రచారసారధిగా నరేంద్ర మోడీని నియమించడంతోనే ఆ కూటమి విజయానికి అంకురార్పణ జరిగింది. పార్టీలో అద్వానీ, సుష్మాస్వరాజ్ వంటి సీనియర్లు వ్యతిరేకించినా కూడా బీజేపీ జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ చొరవ తీసుకుని నరేంద్రమోడీని గోవా కార్యవర్గ సమావేశాలలో ప్రచారసారధిగా నియమించారు. ప్రచారసారధిగా తనకు అప్పగించిన బాధ్యతలను మోడీ సమర్ధవంతంగా నెరవేర్చారు. దేశమంతా ఆయన మనిషిలా తిరగలేదు... మరయంత్రంలా తిరిగారు. లక్షల కిలోమీటర్ల ప్రయాణం చేసారు. ఒకేరోజు నాలుగేసి రాష్ట్రాల్లో ప్రచారసభలు నిర్వహించారు. ఉదయం కాశ్మీర్‌లో వుంటే మధ్యాహ్నం కటక్‌లో, సాయంత్రం కన్యాకుమారిలో ఉండేవాడు. రాత్రికి అహ్మదాబాద్ చేరుకుని పార్టీ కార్యకలాపాలు చూసేవాడు. తాను పరుగెత్తడమే కాదు, పార్టీ కేడర్ చేత కూడా పరుగులు తీయించాడు. పార్టీ నాయకులెవరినీ ఢిల్లీలో కూర్చోనీయలేదు. పల్లెలకు తరిమాడు. ప్రజల మధ్యకు పంపాడు. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా కొన్ని లక్షల ఓట్లను పార్టీ ఖాతాకు చేర్చాడు. 'ఛాయ్ వాలా చర్చ' పేరుతో టీ అమ్ముకునే ప్రతి వ్యక్తిని తన మనిషిని చేసుకున్నాడు. కేవలం కొన్నినెలల ప్రచార కాలంలోనే మోడీ పార్టీని మించి పోయాడు. ఈరోజు అధికార కాంగ్రెస్ వ్యతిరేకత మీద ఎన్డీఏకు మహా అంటే 200సీట్లు వచ్చేవేమో. కాని మోడీని ప్రధానిగా ప్రకటించబట్టి అనూహ్యంగా సీట్ల సంఖ్య పెరిగింది.

ఇక తృతీయ కూటమి కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్న వామపక్షం కోటలు కూలాయి. కేవలం పది స్థానాలకే వాళ్లు పరిమితమయ్యారు. ప్రాంతీయపార్టీలలో అన్నా డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, బిజూ జనతాదళ్‌లు తమ సత్తాచాటాయి. దళ్ (యు), సమాజ్‌వాది, ఆర్జేడీ, బిఎస్పీ వంటి పార్టీలు మోడీ గాలిలో గల్లంతయ్యాయి.

ఇక అధికార కాంగ్రెస్ కూటమి రెండంకెల సీట్లకు పరిమితమైంది. చరిత్రలో ఇంతటి ఘోర పరాజయం ఆ పార్టీకెప్పుడూ లేదు. 29రాష్ట్రాలకు గాను ఆ పార్టీకి కేవలం రెండంకెల సీట్లే వచ్చాయంటే అంతకంటే సిగ్గుమాలిన విషయం ఇంకొకటి వుండదు. వచ్చిన సీట్లను బట్టే చెప్పొచ్చు... పదేళ్ల యూపిఏ పాలనను ప్రజలు ఎంతగా అసహ్యించుకున్నారనేది.

కోట్లాదిమంది ప్రజల కోరిక ఫలించింది. ఎవరైతే వస్తే దేశం బాగుపడుతుందని ప్రజలు భావిస్తున్నారో ఆ నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఒకప్పటి టీ వాలా నేడు దేశానినికి కాపలావాలా కాబోతున్నాడు. యూపిఏ పదేళ్ల పాలనలో భ్రష్టుపట్టిన భారతావనిని ఆయన అభివృద్ధి పథంలో నడిపిస్తాడని జాతి యావత్తూ ఆకాంక్షిస్తూ... అభినందనలు తెలుపుతోంది.

## 5 వ్యవస్థలు

(3వ పేజీ తరువాయి)

కృషి చేసినప్పుడే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చినట్లవుతుంది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలంతా సుఖసంతోషాలతో కళకళలాడాలి. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోనే కాక రాష్ట్రమంతా సమగ్రాభ్యున్నతి సాధించాలి. ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసినప్పుడే..నాయకులు మంచి నేతలుగా, ప్రజాభిమానం చూరగొంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మంచి నాయకులుగా రాణించినప్పుడు.. ఈ అయిదేళ్ళే కాదు.. మరో అయిదేళ్ళు కూడా వారే ప్రజాప్రతినిధిగా.. ప్రజలకు అండగా వుంటూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సాధించవచ్చు. అందుకే, విజేతలైన నాయకులంతా నిండు మనసుతో ప్రజల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ.. అందరి సహకారంతో ముందడుగు వేస్తూ.. ప్రజలు మీమీద పెట్టుకున్న ఆశలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తారని ఆశిస్తున్నాం. ఇక, మీ ప్రతి మాటా.. ప్రగతికి బాట కావాలనీ, ప్రతి అడుగూ సమాజాభ్యున్నతికి బాసట కావాలనీ మనసా వాచా కోరుకుంటున్నాం!

## వైకాపాకు ఏడు... దేశంకు మూడు

సీమాంధ్రలో తెలుగుదేశం హవా నడిచినా నెల్లూరుజిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ తన సత్తాను చాటుకుంది. మొన్న మున్సిపాల్టీలలోనూ, ఆ తర్వాత జడ్పీ ఎన్నికల్లోనూ కొనసాగించిన ఊపునే సార్వత్రిక ఎన్నికలలోనూ కొనసాగించింది. కడప జిల్లా తర్వాత నెల్లూరుజిల్లానే జగన్‌కు వెన్నుదన్నుగా నిలిచింది. నెల్లూరు లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలను వైయస్సార్ కాంగ్రెస్ గెలుచుకోగా, మూడు స్థానాలను మాత్రమే అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం దక్కించుకోగలిగింది. నెల్లూరు పార్లమెంట్ నుండి వైకాపా అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి చాలాతక్కువ మెజార్టీతో గెలిచారు. ఆత్మకూరు అసెంబ్లీలో వైకాపాకు గట్టిపోటీనిచ్చే అభ్యర్థి లేకపోవడం మేకపాటికి కలిసొచ్చింది. పార్లమెంటులో అక్కడ మంచి మెజార్టీ రాబట్టే మేకపాటి బయటపడగలిగాడు. అలాగే ఆత్మకూరు అసెంబ్లీ నుండి మేకపాటి గౌతంరెడ్డి, నెల్లూరురూరల్ నుండి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు నగరం నుండి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు భారీ మెజార్టీలతో విజయం సాధించారు. కావలి నుండి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సర్వేపల్లి నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సూళ్లూరుపేట నుండి కిలివేటి సంజీవయ్య, గూడూరు నుండి పాశం సునీల్‌కుమార్‌లు తక్కువ మెజార్టీలతో విజయం సాధించారు. అలాగే తెలుగుదేశం అభ్యర్థులుగా ఉదయగిరి నుండి గెలిచిన బొల్లినేని రామారావు గాని, వెంకటగిరి నుండి గెలిచిన కురుగొండ్ల రామకృష్ణ గాని, కోవూరు నుండి గెలిచిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గాని తక్కువ మెజార్టీలతోనే గట్టెక్కడం విశేషం!

## కనికరించండి!..కారుణ్యం చూపండి!

మే నెల ఎండలు మండిపోతున్నాయి. గతంలో కంటే ఈ సారి మరీ ఎండలు.. నిప్పులు చిమ్ముతున్నాయి. ఒకవైపు వర్షాభావం, మరోవైపు భూగర్భజలాలు ఎండిపోవడం, కాలువలు, చెరువులు దొరువుల్లో ఎక్కడా చుక్క నీరు కనిపించడం లేదు. ముఖ్యంగా జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు, పొదలకూరు, రాపూరు, వింజమూరు తదితర మెట్టప్రాంతాల్లో అటు సాగునీరు లేక, ఇటు తాగునీరు లేక ప్రజలు, రైతులు నానా బాధలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో, మూగజీవాల పరిస్థితి మరింత దయనీయంగా వుంది. పిడికెడు పచ్చగడ్డి దొరక్క పశువులు విలవిల్లాడుతున్నాయి. పశుగ్రాసం అందుబాటులో లేకపోవడంతో, బక్కచిక్కిపోతున్న గేదెలను, ఎద్దులను ఎలా పోషించుకోవాలో తెలియక, అనేక చోట్ల వాటి యజమానులు వాటిని కబేళాకు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మరోవైపు అటవీప్రాంతాలు, కొండప్రాంతాల్లో కూడా చుక్క నీరు అందుబాటులో లేకపోవడంతో జంతువులు సైతం దస్సిపోతున్నాయి. నీటికోసం వెదుకులాడుకుంటూ జింకలు తదితర వన్యప్రాణులు జనారణ్యంలోకి రావడం, చావుతప్పి కన్ను లొట్టపోయినట్లు మళ్ళీ తిరిగి ఎలాగో అడవికి చేరుకోవడం వంటి సంఘటనలు జరుగుతూనే వున్నాయి. అటవీప్రాంతాల్లో జంతువులు సంచరించే చోట నీటి తొట్లు ఏర్పాటు చేసి వాటి దాహార్తిని తీర్చేందుకు సంబంధిత యంత్రాంగం చేపడుతున్న చర్యలు అంతంతమాత్రంగానే వుంటున్నాయనే ఆవేదన గ్రామీణుల్లో వుంది. ఇకపోతే, పక్షుల సంగతి మరింత దయనీయం. ఎక్కడ చూసినా గుంపులుగుంపులుగా కనిపించే పిచ్చుకలు ఇప్పుడు అసలు కనిపించడం లేదు. పొలాల్లోనూ పక్షుల కిలకిలలు బాగా తగ్గిపోయాయి. అటు పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ ఎక్కువగా కనిపించే కాకుల సంఖ్య కూడా బాగా తగ్గిపోతోంది. ఈ ఎండల్లో అటు గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు వంటి మూగజీవాలను, మన ఇళ్ళ పరిసరాల్లో వుండే పక్షులనైనా కాపాడుకోవాల్సిన కనీసబాధ్యత మనందరిమీదా వుంది. ఈ ఎండాకాలంలో పక్షుల కోసమైనా రోజూ ఒక గిన్నెలో నీళ్ళు పోసి, అవి తాగేందుకు అనువుగా గోడల మీద పెట్టి వుంచితే కొంతలో కొంత వాటికి ఉపయోగకరంగా వుంటుంది. ఈ మండే ఎండల్లో ఎవరికి తోచిన రీతిలో అటు మూగజీవాలకు, ఇటు పక్షులకూ దాహార్తి తీర్చగలిగితే.. అంతకన్నా గొప్ప కార్యం ఏముంటుదీ?.. ఈ మండుటెండల్లో దాహార్తితో అలమటించే సాటి మనిషికి ఓ గ్లాసుడు చల్లటి మంచినీళ్ళిచ్చేదానికంటే పుణ్యం ఏముంటుందీ?.. ఆలోచించండి!..కనికరించండి!..కారుణ్యం చూపండి!..

## పెద్దాయన మృతి తీరని లోటు

మాజీ ముఖ్యమంత్రివర్యులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మరణం తమకు తీరనిలోటని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ, పందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డి, పందిళ్లపల్లి హేమంత్‌కుమార్‌రెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన రాజకీయ జీవితంలో ఎంతోమంది రాజకీయనాయకులను తయారు చేసి, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దిన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి లాంటి నాయకులు అరుదుగా ఉంటారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని వారు ప్రార్థించారు.

## ఇస్కాన్‌లో నరసింహ జయంతి



నెల్లూరు కొండాయపాలెం రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో మంగళవారం నృసింహ జయంతి సందర్భంగా శ్రీ నరసింహస్వామి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నెల్లూరునగర వైకాపా మేయర్ అభ్యర్థి షేక్ అబ్దుల్ అజీజ్ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఇస్కాన్ మందిరం ప్రతినిధి డాక్టర్ సుఖదేవస్వామి పూజలు నిర్వహించి భక్తులకు నరసింహస్వామి అవతారం విశేషాలను వివరించారు.

### ఘనంగా

## శ్రీ భారత్ బిల్డర్స్ రజతోత్సవం

గత 25ఏళ్లుగా నిర్మాణ రంగంలో నెల్లూరీయులకు విశిష్ట సేవలందిస్తున్న 'శ్రీభారత్ బిల్డర్స్' మే 10వ తేదీన నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్దగల సంస్థ కార్యాలయంలో రజతోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. తమ సంస్థను ప్రారంభదశలో ఆదరించి ప్రోత్సహించిన ఆత్మీయులను సంస్థ సారధులు టి.వి.యస్.చలపతిరావు, కె.శ్రీధర్‌లు శాలువాలతో ఘనంగా సత్కరించారు. నమ్మకమైన సేవలతో, పటిష్టమైన నిర్మాణాలతో నెల్లూరీయుల అభిమానాన్ని చూరగొన్నామనే తమపై భరోసా ఉంచి తమను ఆదరిస్తున్న భవన నిర్మాతలందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞులమై ఉంటామని, వారి ఆదరణ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నామని వారు వెల్లడించారు.



ఆత్మీయసన్మానాన్నందుకుంటున్న ఆదిశేషయ్య, వాస్తు రామచంద్ర

### వికలాంగుల

## సేవా సమాజానికి విరాళం

నెల్లూరు పడారుపల్లిలోని ఆచార్య పి.సి.రెడ్డి వికలాంగుల సంక్షేమభవనానికి నెల్లూరు వెంగళరెడ్డి నగర్‌కు చెందిన గున్నం వెంగళరెడ్డి – శేషమ్మ దంపతులు 25వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఆశ్రమంలో వికలాంగులకు సదుపాయాలు సరిపోనందున అదనపు గదుల నిర్మాణం కోసంగా వీరు 25వేల రూపాయలను భవన నిర్వాహకురాలు శ్రీమతి జి.వెంకటలక్ష్మికి అందజేశారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# గూడూరు డివిజన్ వార్తలు

## తెలుగుదేశం, వైకాపా విజయోత్సవాలు

ఉత్కంఠగా నిలిచిన ఛైర్మెన్ ఎన్నికలలో విజయం సాధించడంతో తెలుగుదేశం, వైకాపా శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. గూడూరులోని 33 వార్డులకుగాను 33వ వార్డు టి.సుబ్బమ్మ వైకాపా అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైంది. మిగిలిన 32 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో తెలుగుదేశం పార్టీకి 16, వైకాపాకు 15, స్వతంత్ర అభ్యర్థి ఒక్కస్థానంలో విజయం సాధించారు. 16వార్డుల్లో గెలుపొందిన తెలుగుదేశం, వైకాపా అభ్యర్థులు విజయోత్సవాలు జరుపుకొన్నారు. కాగా గూడూరు పురపాలక సంఘం ఛైర్మెన్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా మారింది. ఎవరికి సరైన మెజారిటీ రాకపోవడంతో ఎవరు ఛైర్మెన్ పదవిని కైవసం చేసుకుంటారో.

దీంతో స్వతంత్ర అభ్యర్థి మద్దతు ఎటువైపు వుంటుందో వారిదే కుర్చీ కానీ ఎమ్మెల్యే, ఎంపీలకు ఓటింగ్ వేసే హక్కు ఉండటంతో సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాతే ఛైర్మెన్ కుర్చీ ఎవరిదనేది స్పష్టత వస్తుంది. 33వార్డులో ఎన్నికైన విజేతలు 1వవార్డు కస్తూరిదేవి విజయమ్మ (వైకాపా) 210ఓట్లు మెజారిటీ, 2వవార్డు ఎస్.కె. నూర్జహాన్ (వైకాపా) 67ఓట్లు మెజారిటీ, 3వవార్డు ఎస్.కె.రమీజా (వైకాపా) 129 ఓట్ల మెజారిటీ, 4వవార్డు చోలవరం గిరిబాబు (వైకాపా) 264 ఓట్లు మెజారిటీ, 5వవార్డు వాటంబేడు శివ కుమార్ (వైకాపా) 99 ఓట్ల మెజారిటీ, 6వవార్డు గోవిందు మస్తానమ్మ(తెలుగు దేశం) 119 ఓట్ల మెజారిటీ, 7వవార్డు ఎంబేటి చంద్రయ్య (వైకాపా) 250ఓట్ల మెజారిటీ, 8వవార్డు చైనా భానుప్రకాష్ (తెలుగుదేశం) 417 ఓట్ల మెజారిటీ, 9వ వార్డు పోసిన రాజేశ్వరమ్మ (తెలుగుదేశం) 220ఓట్ల మెజారిటీ, 10వవార్డు గుండాల భారతి (తెలుగుదేశం) 52ఓట్ల మెజారిటీ, 11వ వార్డు పులిమి శ్రీనివాసులు (తెలుగు దేశం) 120ఓట్ల మెజారిటీ, 12వవార్డు బత్తిన శ్రీదేవి (తెలుగుదేశం) 157ఓట్ల మెజారిటీ, 13వవార్డు ఎస్.కె.షంషీద్ (స్వతంత్ర అభ్యర్థి) 41ఓట్ల మెజారిటీ, 14వవార్డు కోడిపర్తి కల్పన (తెలుగుదేశం) 39ఓట్ల మెజారిటీ, 15వవార్డు బండి విజయ (తెలుగుదేశం) 90ఓట్ల మెజారిటీ, 16వ వార్డు వాసవి పావని (వైకాపా) 49ఓట్ల మెజారిటీ, 17వవార్డు పొనకా దేవసేన (టిడిపి) 215 ఓట్ల మెజారిటీ, 18వవార్డు పిళ్లెళ్ల శ్రీదేవి (వైకాపా) 234 ఓట్ల మెజారిటీ, 19వవార్డు కొణతం లక్ష్మి (వైకాపా) 13ఓట్ల మెజారిటీ, 20వవార్డు దండు మహేష్‌రెడ్డి (వైకాపా) 14ఓట్ల మెజారిటీ, 21వవార్డు శీలం కిరణ్‌కుమార్ (టిడిపి) 170ఓట్ల మెజారిటీ, 22వవార్డు నిమ్మకాయల క్రిష్ణకుమారి (టిడిపి) 367ఓట్ల మెజారిటీ, 23వవార్డు నేరేళ్ల సుబ్బమ్మ (టిడిపి) 87ఓట్ల మెజారిటీ, 24వవార్డు బిల్లు చెంచురామయ్య (టిడిపి) 161 ఓట్ల మెజారిటీ, 25వవార్డు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి (వైకాపా) 78ఓట్ల మెజారిటీ, 26వవార్డు ముప్పాళ్ల లక్ష్మి (టిడిపి) 316 ఓట్ల మెజారిటీ, 27వవార్డు బాలిబోయిన రమేష్ (టిడిపి) 250 ఓట్లమెజారిటీ, 28వ వార్డు తాతపూడి ఇజ్రాయిల్‌కుమార్ (వైకాపా) 193 ఓట్ల మెజారిటీ, 29వ వార్డు పొంగలూరు శ్రీనివాసులు (టిడిపి) 186 ఓట్ల మెజారిటీ, 30వవార్డు ఎస్.కె. అస్మా (వైకాపా) 157ఓట్ల మెజారిటీ, 31వవార్డు నాగిశెట్టి మురళీ కృష్ణ (వైకాపా) 217ఓట్ల మెజారిటీ, 32వ వార్డు నాశిన నాగులు (వైకాపా) 242 ఓట్ల మెజారిటీ, 33వ వార్డు టి.సుబ్బమ్మ (వైకాపా) ఏకగ్రీవం.

## 41 ఓట్లతో స్వతంత్ర అభ్యర్థిని షంషీద్ విజయం



విజయం కోసం కలలు కనే వారికి ప్రయత్నం తోడైతే అది వరిస్తుందనే అంటారు. స్వతంత్ర అభ్యర్థి షంషీద్ విజయాన్ని పరిశీలిస్తే అది స్పష్టమవుతోంది. 2005లో జరిగిన ఎన్నికల్లో ఆమె విజయం కోసం ప్రయత్నించి విఫలం చెందినా 2014లో తిరిగి ఎన్నికల్లో విజయం కోసం ప్రయత్నించి సఫలమయ్యారు. నాడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి 14ఓట్ల తేడాతో ఓడారు. నేడు వైకాపా టిక్కెట్ ఆశించినా దక్కక స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి తను గతంలో ఓడిన 14 అంకెను తిరగరాసి 41ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

***తెలుగుదేశం పార్టీలో 13వవార్డు స్వతంత్ర అభ్యర్థి:***

గూడూరు పురపాలక సంఘ పరిధిలోని 13వవార్డు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన షంషీద్ బుధవారం రాత్రి కరణాలవీధి వద్దగల తెలుగుదేశం ఛైర్మెన్ అభ్యర్థి పొనకా దేవసేన గృహంలో మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, శీలం కిరణ్‌కుమార్, తెలుగుదేశం వార్డు విజయం సాధించిన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ సేవలు అభినందనీయం



వృద్ధురాలికి సరకులు అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

క్రమం తప్పకుండా దశాబ్ధ కాలంగా రోటరీ సేవలు అందించడం ఎంతో అభినందనీయమని అల్లూరు ఆదిశేషారెడ్డి అల్లుడు ఆర్. గోపాల్ కృష్ణారెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని మఠంవీధిలో ఉన్న రోటరీ భవనంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతినెలా నిరాదరణకు గురైన వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన ఫలసరుకులను ఇతర సామాగ్రిని అందజేయడం గొప్ప విషయమన్నారు. దాత అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రారంభించిన ఈ పథకం చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆయన వివరించారు. చెన్నై ప్రాంతానికి చెందిన డాక్టర్ మోహన్‌రెడ్డి ఆ క్లబ్‌కు 25వేల రూపాయలు అందజేశారు. అనంతరం వారి చేతుల మీదుగా వృద్ధులకు చీరలు, ధోవతులు, పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జానకిరామిరెడ్డి, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, జె.డి.రెడ్డి, కె.మునిగిరీష్, కె.సుందర రామిరెడ్డి, దయాకరరెడ్డి, హనుమంతరావు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### శేష వాహనంపై

## చెన్నకేశవస్వామి



గూడూరు పట్టణంలోని కరుణాల వీధిలోగల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి శనివారం రాత్రి శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలకు వాయుగండ్ల శ్రీనివాసులు, ఈశ్వరమ్మ, దేవికి సుబ్రహ్మణ్యం, సుభాషిణి, ఆవుల చినకోటేశ్వరరావు, విజయలక్ష్మి, వేదవ్యాస్, సురేఖ, విష్ణుప్రియ, శ్రావణ్‌కుమార్, ఉభయకర్తలుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం, మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, రాత్రి హంస వాహనంపై గ్రామోత్సవం జరుగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ముక్కస శశిధర్ తెలిపారు.



# శ్రీకాళహస్తి న్యూస్

### శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో...

## ఎగిరిన పచ్చజెండా

చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి పురపాలక సంఘ ఎన్నికల్లో టి.డి.పి. విజయఢంకా మ్రోగించింది. పురపాలక సంఘంలో మొత్తం 35 వార్డులుంటే అందులో 18 టి.డి.పి. కైవసం చేసుకుంది. వై.ఎస్.ఆర్.11 స్థానాల్లో, కాంగ్రెస్ 4 స్థానాలు, ఇండిపెండెంట్ 2 స్థానాలను చేజిక్కించుకుంది. చిత్తూరుజిల్లాలో శ్రీకాళహస్తి మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించడం విశేషం. సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన పురపాలక సంఘ ఎన్నికల్లో శ్రీకాళహస్తిలో టిడిపి విజయఢంకా మ్రోగించడం టిడిపి పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే బొజ్జలగోపాలకృష్ణారెడ్డికి అనుకూలించింది. పురపాలక సంఘంలో మొత్తం 57, 139 మంది ఓటర్లు ఉండగా 42,089 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉంది. ఇందులో టిడిపికి 17,923, వైసిపికి 14,022, కాంగ్రెస్‌కు 7,851, ఇక స్వతంత్ర అభ్యర్థులు 2,282 ఓట్లు సాధించారు.

పురపాలక సంఘం ఏర్పడి 1959 నుంచి రిజర్వేషన్ల మార్పుతో రెండుసార్లు మాత్రమే టి.డి.పి. అధికారం చేపట్టింది. మిగిలిన అన్నిసార్లూ కాంగ్రెస్ పార్టీయే గెలు పొందింది. ఇప్పుడు ఛైర్మన్ స్థానం జనరల్ అయినప్పటికీ కాంగ్రెస్ తన పట్టు నిలబెట్టుకోలేకపోయింది. ఆ స్థానంలో ఇప్పుడు టిడిపి విజయం సాధించింది. పురపాలక సంఘం పాలనంతా కాంగ్రెస్‌హయాంలో పవార్ కుటుంబీకుల చేతుల్లోనే ఉండేది. ఇప్పుడు ఆ కుటుంబానికి చెందిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ శాంతారాం జె.పవార్ నడిపించారు. శాంతారాం జె.పవార్ ఇటీవల సాధారణ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో నుంచి టిడిపి పార్టీలోకి వచ్చారు.

1వ వార్డు పి.మహాలక్ష్మి వైసిపి, 2వ వార్డు జి.బాలకృష్ణయ్య ( వైసిపి), 3వ వార్డు నుంచి పులి మౌనిక (టిడిపి), 4వ వార్డు నుంచి హరి (వైసిపి), 5వ వార్డు నుంచి పేట రాధారెడ్డి (టిడిపి), 6వవార్డు నుంచి పూజా గీత ( వైసిపి), 7వ వార్డు నుంచి జి.శాంతి (టిడిపి), 8వ వార్డు నుంచి ఎం.రవి (టిడిపి), 9వ వార్డు నుంచి సి.సుప్రజ (టిడిపి), 10వ వార్డు నుంచి పి.లీలావతి (టిడిపి), 11వ వార్డు నుంచి జి.లత (కాంగ్రెస్), 12వ వార్డు నుంచి కె.జయ (కాంగ్రెస్), 13వ వార్డు నుంచి జి.పుష్ప (కాంగ్రెస్), 14వ వార్డు నుంచి ఉదయ్‌కుమార్ (స్వతంత్ర), 15వ వార్డు నుంచి వి.గురునాగరాజ (టిడిపి), 16వ వార్డు నుంచి షేక్ బషీర్ (టిడిపి), 17వ వార్డు నుంచి ఎం.రంగయ్య (వైసిపి), 18వ వార్డు నుంచి ఎన్.మోర్ (టిడిపి), 19వ వార్డు నుంచి జి.విజయ్‌కుమార్ (టిడిపి), 20వ వార్డు నుంచి సి.నాగేశ్వరరావు ( స్వతంత్ర), 21వ వార్డు నుంచి టి.విజయలక్ష్మి (టిడిపి), 22వ వార్డు నుంచి బి.ధర్మయ్య (వైసిపి), 23వ వార్డు నుంచి ఎన్.దుర్గాప్రసాద్ (టిడిపి), 24వ వార్డు నుంచి బి.మునికృష్ణ (టిడిపి), 25వ వార్డు నుంచి యు.శరవణకుమార్ (టిడిపి), 26వవార్డు నుంచి కె.పార్థసారధి (టిడిపి), 27వ వార్డు నుంచి వి.అనిత (టిడిపి) 28వ వార్డు నుంచి జయదేవన్‌గిరి (వైసిపి), 29వ వార్డు నుంచి బి.వసంతమ్మ (వైసిపి), 30వ వార్డు నుంచి ఆర్కాడు ముత్తు ( కాంగ్రెస్), 31వ వార్డు నుంచి పి.ప్రసాదరావు (టిడిపి), 32వ వార్డు నుంచి సరోజ (వైసిపి), 33వ వార్డు నుంచి ఎ.నాగరాణి (టిడిపి), 34వ వార్డు నుంచి ఆర్కాడు కాంతమ్మ (వైసిపి), 35వ వార్డు నుంచి కూలి పి.నాగరాజమ్మ (వైసిపి) గెలుపొందారు. అయితే ఛైర్మన్ పదవి టిడిపి పార్టీనే చేజిక్కించుకుంది.



# అనుకున్నట్లే జరిగింది.. ఆదాల ఓటమికి అభ్యర్థిత్వాలే కారణం



నెల్లూరు లోక్‌సభ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి గెలిచే అవకాశమున్నా అసెంబ్లీలకు సరైన అభ్యర్థులను ఎంపిక చేయడంలో విఫలమైన కారణంగా దాని ప్రభావం ఆదాల ప్రభాకర్‌రెడ్డి మీద పడింది. కేవలం ఆత్మకూరు నియోజకవర్గంలో వైకాపాకు భారీగావచ్చిన మెజార్టీవల్లే ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఓటమిపాలు కావాల్సివచ్చింది. ఆదాల నెల్లూరు లోక్‌సభకు పోటీకి చేయాలని నిర్ణయించుకున్నాక అసెంబ్లీ అభ్యర్థులపై దృష్టిపెట్టారు. నెల్లూరు నగరం, కోవూరు, కావలి, ఉదయగిరిలలో సమర్థులైన అభ్యర్థులనే నిలబెట్టారు. కాని నెల్లూరు రూరల్, ఆత్మకూరులు పెద్ద సవాల్‌గా మారాయి. రూరల్ నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పోటీ చేయించాలని ఆదాల భావించారు. అయితే చంద్రబాబు బీజేపీతో పొత్తులో భాగంగా ఈ సీటును ఆ పార్టీకి వదిలేసారు. దీనివల్ల జరిగే నష్టాన్ని ఆరోజే ఊహించాడు. సీటును మార్పించేందుకు శతవిధాలా ప్రయత్నించాడు. కాని చంద్రబాబు ఒప్పుకోలేదు. ఇక ఆత్మకూరులో చూస్తే గుటూరు కన్నబాబు బలహీనమైన అభ్యర్థి. మేకపాటి గౌతంరెడ్డి ముందు చాలడని తేలింది. దీంతో ఆయన బదులు గట్టి అభ్యర్థి కోసం ప్రయత్నించారు. మరోపక్క ఆనం రామనారాయణరెడ్డి తాను ఇక్కడ పోటీ చేసే విషయమై నాన్చాడు. దీంతో కాంగ్రెస్‌లో వున్న బలమైన కేడర్ తెలుగుదేశంలో బలహీనంగా వున్న గూటూరు కన్నబాబు వైపుకు వెళ్లలేక మేకపాటి వైపు చేరారు. దీంతో పార్లమెంటు, అసెంబ్లీలో మేకపాటి తండ్రీ కొడుకులకు భారీమెజార్టీ వచ్చింది. నెల్లూరురూరల్, నగరం, కోవూరులలో ఆదాలకు అనుకూలంగా భారీ క్రాస్‌ఓటింగ్ జరిగినా ఆత్మకూరు మెజార్టీ ఆయనను ఓడించింది.












Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.